

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 343 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 09, నవంబర్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# సీఎం సీరియస్ !



**విద్యా సంస్థల బంధు పిలుపుపై సీఎం అగ్రహం**

**ప్రైవేట్ విద్యాసంస్థలు డొనేషన్ల వసూళ్లకు పాల్పడుతున్నాయి**

**ప్రభుత్వం విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాలి**

**విద్యా సంస్థలపై విజిలెన్స్ దాడులు అనగానే ఇవన్నీ జరుగుతున్నాయి**

**విద్యా సంవత్సరానికి విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదు**

**ప్రభుత్వంతో చర్చలు జరుపుకోవాలని గానీ బెదిరింపు లేదు**

**ప్రతి సంవత్సరం విద్యాసంస్థలకు బోలెడు మినహాయింపులు దొరుకుతున్నాయి**

**ఐటీలు చెల్లించని విద్యాసంస్థలు బోలెడు ఉన్నాయి**

**విద్యా నియమాలను తుంగలో తొక్కుతున్న విద్యాసంస్థలపై చర్యలు ఎక్కడ**

**అక్రమ విద్యాసంస్థలపై విద్యార్థులు పోరాడితే తప్పుపడుతున్నారు**

**అక్రమంగా ఫీజులకు పాల్పడితే విద్యార్థి సంఘాల పోరాటాలు ఎక్కువవుతాయి**

**డాక్టర్ బరిగెల శివ**



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్








**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

ప్రభుత్వ విద్యా చట్టాలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థలపై కొరడా జరిపించాలని డాక్టర్ బరిగెల శివ డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం లెక్కకు మించిన సంఖ్యల్లో విద్యార్థుల డొనేషన్లను అక్రమ పద్ధతిలో వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కూడా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యా సంవత్సర ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు ప్రైవేట్ విద్యా సంస్థలకు బోలెడు మినహాయింపులు దొరుకుతున్నాయని అనధికార హోదాలో కొనసాగించబడుతున్న విద్యాసంస్థల నుండి ప్రభుత్వానికి ఎలాంటి ఉపయోగం లేనప్పటికినీ పేద విద్యార్థుల విద్యను ఆటంకం కల్పించకుండా విద్యార్థులకు న్యాయం జరగాలని సదుద్దేశంతో అక్రమ పద్ధతిలో కొనసాగుతున్న విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదన్నారు. సజావుగా సాగుతున్న విద్యా సంవత్సరాలను మధ్యలో ఇబ్బందులకు గురి చేయొద్దని మంచి మనసుతో ప్రభుత్వం విద్యాసంస్థలపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. ఈ మధ్యకాలంలో విద్యాసంస్థల ఫీజుల దోపిడీ డొనేషన్ల దోపిడీ అడ్వాన్స్ ఫీజుల దోపిడీ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల దోపిడీ పేమెంట్ సీట్ల దోపిడీ ఎక్కువ జరుగుతుండగా వాటిపై ప్రభుత్వం విజిలెన్స్ కమిటీలు వేస్తూ వాటిని నియంత్రించాలని ప్రయత్నించిన సందర్భంలో విద్యాసంస్థలన్నీ ఏకమై ప్రభుత్వం విద్యా సంస్థలకు రావలసిన బకాయిలను చెల్లించడం లేదంటూ విద్యాసంస్థలను నడపలేమంటూ మధ్యలో విద్యార్థులకు అన్యాయం చేస్తామనడం సరైనది కాదన్నారు. ఇప్పటికే విద్యాసంస్థలకు ప్రభుత్వానికి మధ్య పలుమార్లు చర్చలు జరిగినప్పటికినీ విద్యాసంస్థల యాజమాన్యాలు మొండి వైఖరిని ప్రదర్శిస్తుండడంతో ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేయాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం చెల్లించాల్సిన సొమ్ముకు నాలుగు రేట్లకు పైగా డొనేషన్లకు పాల్పడుతున్న విద్యాసంస్థలు కూడా ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నప్పుడు వాళ్ల కళాశాలల అనుమతుల్లో భవన నిర్మాణాల్లో ప్రభుత్వ విద్యా చట్టాలతో పాటు యూజీసీ చట్టాల నియమాలు పాటిస్తున్నారా లేదా అనేది సరి చేసుకోవలసి ఉందన్నారు. ప్రభుత్వం బకాయిల ఫీజులను చెల్లించకపోవడంలో ప్రభుత్వాన్ని నిందించుకోవడం ప్రైవేట్ విద్యాసంస్థలు తప్పుగా భావించక పోవచ్చు గానీ విద్యాసంస్థల్లో జరుగుతున్న లోపాలు లోసుగులు, విద్య బోధన నియమాల పట్ల అధ్యాపకుల నియామకాల పట్ల ప్రభుత్వం ఒక్కసారిగా కన్నెర్ర చేస్తే పరిస్థితి ఏమిటని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ సంస్థ ప్రతిష్టాత్మకంగా పనిచేస్తున్నందునే ప్రైవేట్ విద్యా సంస్థలు

- మిగతా 2లో..

## కబ్జా భూమిలో కాంగ్రెస్ నేత

కబ్జా భూములకు కసాయి పత్రాలు

కరుడుగట్టిన కబ్జాల వెనుక చక్రం తిప్పుతున్న కాంగ్రెస్ నేత భట్టి శ్రీను ?

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పట్టాదారులపై పలు అక్రమ కేసులు

పట్టింపు లేని ఎమ్మెల్యేలు, మంత్రులు

దౌర్జన్యపు కబ్జాలపై స్పందించని అధికారులు పోలీసు, మున్సిపల్ అధికారులు

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కరుడుగట్టిన కబ్జా అంటే ఇదేనేమో

పత్రికా ముఖంగా ఆధారాలు వెల్లడించాలని పట్టాదారుల డిమాండ్



2

## వేడెక్కుతున్న బీహార్ ఎన్నికల ప్రచారం

3

బీహార్ చేపల కోసం పెద్దపెద్ద వాళ్లు వస్తున్నారు

రాహుల్ చేపలవేటపై మోడీ వ్యంగ్యాస్త్రాలు



## ఓట్లు లాగేందుకు రూ.10వేల లంచం

బీహార్ ప్రచారంలో ప్రియాంక

**పాట్నా, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్) :**



రూ.10వేలు ఇచ్చి, ఓట్లు కొల్లగొట్టొచ్చని భాజపా భావిస్తోందని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకాగాంధీ విమర్శించారు. కతిహార్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడారు. ఒకప్పుడు మహాత్మాగాంధీ చేసిన పోరాటమే కాంగ్రెస్ చేస్తోంది. ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలు అన్నింటిని తన ఇద్దరు కార్పొరేట్ స్నేహితులకే అప్పగిస్తున్నారు. ఆయన కట్టా వంటి పదాలను ఉపయోగించి, ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అంటూ దుయ్యబట్టారు. ఎన్నికల వేళ బిహార్ ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజనను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లోకి డబ్బు జమ చేయడం దాని ఉద్దేశం. మహిళా సాధికారత, స్వయం ఉపాధి కల్పించే దిశగా రూ.7,500 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించారు.

## న్యూస్ పేపర్‌లో భోజనం వడ్డింపా

మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై రాహుల్ మండిపాటు

3



## రాష్ట్రంలో రహదారులకు మహర్దశ

రూ.60,799 కోట్లతో రోడ్ల నిర్మాణం - మంత్రి కోమటిరెడ్డి వెల్లడి



3

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

## రాయపర్తి గురుకులంలో ఘనంగా ముగిసిన 11వ జోనల్ క్రీడా పోటీలు



**రాయపర్తి (జై భీమ్ న్యూస్)**

రాయపర్తి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 6న ప్రారంభమైన 11వ జోనల్ క్రీడా పోటీలు శనివారం నాడు ఘనంగా, కోలాహలంగా ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన ఈ క్రీడా ఉత్సవంలో వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 14 గురుకుల పాఠశాలల నుండి 1190 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చివరి రోజు జరిగిన అథ్లెటిక్స్, కోకో, కబడ్డీ, చెస్, క్యారమ్స్, హ్యాండ్‌బాల్ వంటి విభాగాల పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. విద్యార్థుల క్రీడాస్ఫూర్తి, పోటీ తత్వం ప్రేక్షకులను ఆకట్టుకుంది. విజేతలకు రాయపర్తి పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. సరిత, అలాగే వరంగల్, హన్మకొండ జిల్లాల వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్ బహుమతులు, మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు.

**అథ్లెటిక్స్ విభాగంలో:**

అండర్-14 ఇండివిడ్యువల్ ఛాంపియన్‌షిప్‌ను తొర్రూర్‌కు చెందిన సంకీర్తన గెలుచుకుంది.

అండర్-17 విభాగంలో మడికొండ పాఠశాలకు చెందిన చందన శ్రీ విజేతగా నిలిచింది.

అండర్-19 విభాగంలో మహబూబాబాద్ 2 పాఠశాలకు చెందిన అశ్విని ఛాంపియన్‌గా నిలిచింది.

అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో

అండర్-14 కేటగిరీలో - తొర్రూర్,

అండర్-17 కేటగిరీలో - మడికొండ,

అండర్-19 కేటగిరీలో - మడికొండ పాఠశాలలు విజేతలుగా నిలిచాయి.

గేమ్స్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో

అండర్-14 విభాగంలో - రాయపర్తి,

అండర్-17 విభాగంలో - పరకాల,

అండర్-19 విభాగంలో - రాయపర్తి పాఠశాలలు విజేతలుగా నిలిచాయి.

అలాగే గేమ్స్ అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో

అండర్-17 కేటగిరీలో - మడికొండ,

అండర్-19 కేటగిరీలో - రాయపర్తి పాఠశాలలు విజేతలుగా నిలిచాయి.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. సరిత మాట్లాడుతూ, “ఈ నెల 6 నుండి ప్రారంభమైన 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్ ఎంతో విజయవంతంగా ముగిసింది. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి క్రీడాస్ఫూర్తిని చాటుకున్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి” అని పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీల పర్యవేక్షణలో జెడ్ఓ విద్యా రాణి కీలక పాత్ర వహించారు. పోటీల నిర్వహణలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సమష్టిగా సహకరించారు.

## సీఎం రేవంత్ రెడ్డి జన్మదినోత్సవం ఉత్సాహంగా నిర్వహణ



**వరంగల్ (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా వరంగల్ పోచం మైదాన్ సాయిబాబా ఆలయం సమీపంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి పండ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బసవరాజ్ శ్రీమన్, మాజీ కార్పొరేటర్ తత్తర లక్ష్మణ్, జన్ను రవి, గోరంటల రాజు, మార్త ఆంజనేయులు, తోట బాలరాజు, రాజనాల శ్రీహరి, వి. లక్ష్మణ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరబెట్టిన పత్తి మంటలకు ఆహుతి

సిద్దిపేట, నవంబర్ 8 (ఆర్ఎన్ఐ): ఇటీవలి వర్షాలతో పంటలను కాపాడుకున్న రైతుపై అగ్నిహోత్రుడు ఆగ్రహం చెందాడు. ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని 300 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. బెజ్జంకికి చెందిన రైతు బండి ఐలయ్య తన పది ఎకరాలతో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. కొద్దిరోజులుగా పత్తి తీత పనులు కొనసాగుతుండగా.. ఇంటికి తెచ్చిన పత్తిలో తడి ఆరేందుకు ఖాళీ స్థలంలో టార్పాలిన్లు వేసి ఆరబెట్టారు. మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని క్షణాల్లో పత్తి మొత్తం కాలి బూడిదైంది. రైతు ఐలయ్యతో పాటు కుమారులు రమేష్, అనిల్, ఇతర కుటుంబ సభ్యులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. సుమారు 300 క్వింటాళ్ల మేర పత్తి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ఇన్ని రోజుల కష్టం బూడిద పాలు కావడంతో బోరున విలపించారు. ఘటనా స్థలాన్ని సిద్దిపేట పోలీసులు పరిశీలించారు.

# సీఎం సీరియస్

మొదటి పేజీ తరువాయి

ఏమాత్రం ఇబ్బందులకు గురికావడం లేదని కౌన్సిల్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడితే చాలా విద్య సంస్థలు మూతపడే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 75 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుకుంటుండగా ప్రభుత్వ విద్యతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వం చెల్లిస్తున్న ఫీజులతో చదువుకుంటున్న విద్యార్థులు కలరని వారందరి విద్యాసంవత్సరాలు పూర్తవుతున్న విద్యార్థులకు రావాల్సిన ధ్రువపత్రాలను అందించడంలో ప్రైవేట్ ప్రభుత్వ విద్యా సంస్థలు తీవ్రమైన కఠినతనాన్ని ప్రదర్శిస్తూ వాళ్లని అడ్డుకోవడమే కాకుండా బకాయిలు చెల్లించే వరకు ధ్రువపత్రాలు ఇవ్వేది లేదంటూ మొరాయిస్తూ విద్యార్థులు ఉన్నత చదువుకు తీవ్రమైన ఆటంకాలు సృష్టించుతున్నారని అన్నారు. అనధికార హోదాలో పర్మిషన్లు పొందుకున్న విద్యాసంస్థలపై పెనాల్టీలు వేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. విద్యాసంస్థలపై విజిలెన్స్ దాడులు అనగానే ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రదర్శిస్తామంటే ఏమాత్రం సరి కాదన్నారు. అన్ని సరిగా ఉన్నాక భయం ఎందుకు అంటూ విద్యాసంస్థలకు సవాల్ విసిరారు. ప్రభుత్వంతో చర్చలు జరుపుకొని సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాల్సిన విద్యాసంస్థల యాజమాన్యం మొండి వైఖరిని ప్రదర్శిస్తే వాళ్లకి ఏం నష్టం జరిగేది లేదు గానీ విద్యార్థులకు తీవ్రమైన నష్టం జరిగి విద్యాసంవత్సర మధ్యలో అనేక రకాల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అన్ని విద్యాసంస్థలలో ఆన్‌లైన్ ఫీజుల పద్ధతి కొనసాగుతున్నప్పుడు విద్యార్థుల దగ్గర వసూలు చేస్తున్న ఫీజులను ఆడిట్ రికార్డుల ఆధారంగా విచారణకు సిద్ధపడే విద్యాసంస్థలు ఎన్నో పరీక్షించుకోవాలన్నారు. యాజమాన్యాలు ఇష్ట రాజ్యాంగ ఫీజులు దండుకోగా లేనిది, ఒక్కొక్క ప్రైవేట్ విద్యాసంస్థల్లో లెక్కలేనన్ని మేనేజ్మెంట్ సీట్స్ నింపుకుంటుండగా లేనిది ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు అనేసరికి రచ్చకెక్కడం దేనికి నిదర్శనమో తెలుపాలన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకుంటున్న విద్యార్థులు దాదాపుగా పేదవాళ్లేనని వాళ్లకు సహాయం చేయడంలో ప్రభుత్వం ఎట్టి పరిస్థితిలో వెనుకడుగు వేయొద్దన్నారు. విద్యార్థుల నుండి అత్యధికంగా డొనేషన్ల వసూళ్లకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై కొరడా జలిపించాల్సిందే అన్నారు. విద్యాసంస్థల అనుమతుల్లో చాలాచోట్ల అక్రమాలు జరుగుతున్నాయని వాటిని నియంత్రించడం కోసం విద్యాశాఖ మంత్రి ప్రస్తుతం ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం చూసి చూడకుండా పోతున్నందునే ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ప్రైవేట్ కళాశాలల ఆగడాలు ఇంకా కొనసాగుతున్నాయని గుర్తుంచుకోవాలన్నారు. సంవత్సర వారి ఫీజుల మోత ఎక్కువైందని దాని భారం పేదలపై పడుతుందన్న సంగతిని విద్యాసంస్థల యాజమాన్యాలు మర్చిపోకూడదన్నారు. ప్రభుత్వంతో ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న చర్చలపై నిబంధనలకు విరుద్ధంగా విరుద్ధమైన ప్రకటనలు చేస్తూ విద్యార్థులను భయాందోళనకు నెట్టడంతోపాటు ప్రైవేట్ వ్యక్తులను ప్రభుత్వంపై ఉసుగలుతున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. విచ్చలవిడిగా ఫీజులకు పాల్పడుతున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంతో పాటు తక్షణమే అట్టివసూళ్ల ఫీజులు నియంత్రించాలన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో చాలా విద్యాసంస్థలు ఐటీ రిటర్న్ లో ఎక్కడలేని తప్పులు పొందుపరుస్తున్నారని వాటిని పరీక్షించుట కొరకు వసూళ్లకు పాల్పడుతున్న విధానం ఆడిట్ రికార్డులలో చూపెడుతున్న విధానాలను అధ్యాపకుల జీతాలతో పాటు విద్యాసంస్థలు ఖర్చు చేస్తున్న సొమ్ము పట్ల పెద్ద ఎత్తున అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వాటన్నిటిపై విచారణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత విద్యాశాఖ మంత్రిదేనన్నారు. విద్యార్థులకు అన్యాయం చేస్తే ఎట్టి పరిస్థితిలో సహించేది లేదని ఇప్పటికే విద్యార్థులు చాలా నష్టపోయారని కావాలని విద్యార్థులను వేధిస్తూ విద్యా సంవత్సరానికి ఆటంకాలు కల్పించాలని చూస్తే ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్య అక్రమ ఆస్తులపై విచారణలు కొనసాగించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అక్రమంగా సంపాదించుకున్న సొమ్మంతా ప్రభుత్వ బ్యాంకులలో రుణముగా పెట్టుకొని వాటితో వస్తున్న కోట్లాది రూపాయలతో యదేచ్ఛగా విద్యాసంస్థలు నడుపుతున్న యాజమాన్యాలు కూడా లేకపోలేదని అలాంటప్పుడు ప్రభుత్వంతో సస్యశ్యామలమైన చర్చలు జరుపుకొని రావలసిన ఫీజుల బకాయిలను రప్పించుకోవాలి గానీ తిరుగుబాటుతనంతో ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రదర్శిస్తామంటే ఏమాత్రం సరికాదన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో పాఠశాల నుండి మొదలుకొని విశ్వవిద్యాలయాల వరకు ప్రభుత్వం లెక్కలేనంత జీతాలు చెల్లిస్తుందని పదవి విరమణ పొందిన ఉద్యోగులకు జీతాలతో పాటు బెనిఫిట్స్ కూడా చెల్లించాల్సి ఉందని కేవలం విద్యాశాఖకు కేటాయించిన సొమ్ములోనే వాటన్నిటిని చెల్లించుకోవాలని అవి కాకుండా ప్రభుత్వానికి డబ్బులు రాబట్టుకోవడానికి వేరే ప్రత్యామ్నాయ మార్గాలు ఏమీ లేవని గమనిస్తూ, గుర్తిస్తూ ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ప్రైవేట్ విద్యాసంస్థలు కార్పొరేట్ విద్యా సంస్థలు అన్ని విధాల పేద విద్యార్థులను ఆదుకోవాలని కొంత ఓపికతో కొంత సహనంతో ప్రభుత్వం నుండి రావలసిన ప్రైవేట్ విద్యార్థుల పాత బకాయిలను తెప్పించుకోవాలని సూచించారు. అదే సమయంలో ప్రభుత్వం కూడా మొండితనం ప్రదర్శించకుండా పేద విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలను దశలవారీగా చెల్లిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు.

# కబ్జా భూమిలో కాంగ్రెస్ నేత

**కబ్జా భూములకు కసాయి పత్రాలు**

**కరుడుగట్టిన కబ్జాల వెనుక చక్రం తిప్పుతున్న కాంగ్రెస్ నేత భట్టి శ్రీను ?**

**కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పట్టాదారులపై పలు అక్రమ కేసులు**

**పట్టింపు లేని ఎమ్మెల్యేలు, మంత్రులు**

**దౌర్జన్యపు కబ్జాలపై స్పందించని అధికారులు**

**పోలీసు, మున్సిపల్ అధికారులు**

**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కరుడుగట్టిన కబ్జా అంటే ఇదేనేమో**

**పత్రికా ముఖంగా ఆధారాలు వెల్లడించాలని పట్టాదారుల డిమాండ్**



**హన్మకొండ (జై భీమ్ న్యూస్)**

సాధారణ భూపట్టాదారులైన ముస్లింలను వేధింపులకు గురిచేస్తూ భూకబ్జాలు చేస్తుండడం ఎంతటి తీవ్రమైన మోసమో హన్మకొండ జిల్లా గుండ్లసింగారం గ్రామంలోని ముస్లిం పట్టాదారుల వేదనను పట్టించుకున్న నాధుడు లేకపోతున్నాడు. హైకోర్టులో జిల్లా కోర్టులలో పలు కేసులు నడుస్తుండగా వాటిని విచారించకుండా వాటికి గౌరవం ఇవ్వకుండా కేవలం భూ కబ్జాదారుల పలుకుబడితో అక్రమ పహానిలకు బిల్డింగ్ అనుమతులు మంజూరు చేసిన మున్సిపల్ అధికారుల గొప్పతనం ఎంత గొప్పదో రాష్ట్ర ప్రజలందరూ గమనించాలంటున్నారు. అంత దౌర్జన్యంగా కబ్జాలు చేస్తున్నప్పుడు ఆధారాలు బయట పెట్టడానికి భయం ఎందుకు అంటూ సర్వేనెంబర్ 1/1 పట్టాదారులు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నేత భట్టి శ్రీను పోలీస్ మున్సిపాలిటీ అధికారులను గుప్పిట్లో పెట్టుకుని అక్రమంగా బిల్డింగ్ అనుమతులు ఇప్పిస్తూ పోలీస్ అధికారులచే పట్టాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తూ భూపట్టదారులకు కలిగి ఉన్న హక్కుల్లో గల భూమిని దౌర్జన్యంగా కబ్జాలు చేయిస్తున్నాడాన్ని ఏ ఒక్కరు తీవ్రంగా పసిగడ్డ లేకపోతున్నారని పట్టాదారులు ఆందోళన చెందుతున్నారు. పట్టాదారులు తెలియజేస్తున్న వివరాల ప్రకారం కబ్జా భూమిలో వెనుక బట్టి శ్రీను ఉండి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు వరంగల్ ఎంపీ కడియం కావ్య, మంత్రి కొండా సురేఖ, మంత్రి సీతక్క, పరపతిని ఉపయోగించి పట్టాదారులను వేధిస్తున్నారని స్వయంగా పట్టాదారులే అన్ని శాఖలకు తెలుపుతున్నప్పటికీ పట్టాదారులకు సహకరించడానికి భట్టి శ్రీను చేస్తున్న ఒత్తిడితో ఏ ఒక్క అధికారి పట్టాదారులకు సహకరించడానికి ముందుకు రాకపోతుండడం వల్ల పట్టాదారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఇదంతా కేవలం తన సోదరులు బత్తిని శ్రీనివాసరావు బత్తిని వేణుగోపాలరావు కుటుంబ సభ్యులు అకారణంగా కబ్జాలు చేస్తున్న భూములకు సహకరించడం కోసమేనని పట్టాదారులు స్పష్టంగా వెల్లడిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే అక్రమంగా కబ్జాలు చేయడం మొదలు పెడుతూ భట్టి శ్రీను పలుకుబడితో కేవలం రెండు సంవత్సరాల్లోనే పట్టాదారులపై ఆరు క్రిమినల్ కేసులు నమోదు చేయించడం ఎంతటి దుర్మార్గమో ప్రజాప్రతినిధులు ఇప్పటికీ పసిగట్ట లేకపోతున్నారని పట్టాదారులు వేదనపడుతున్నారు. ప్రజాప్రతినిధులకు బట్టి శ్రీనుకు ఇట్టి భూకబ్జా విషయంతో సంబంధం లేదని బయటకు ప్రచారం చేస్తున్నప్పటికీ కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం లోనే పట్టాదారులపై ఇన్ని క్రిమినల్ కేసులు ఎందుకు నమోదు అయ్యాయో ఎవరు తెలపడం లేదని పట్టాదారులు అంటున్నారు. బత్తిని శ్రీనివాసరావు చేస్తున్న కబ్జాలపై కనీసానికి మందలించే అధికారి లేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ పాలన దుర్మార్గాలకు నిదర్శనంగా మారిపోయిందని పట్టాదారులు కన్నీరు మునిరవుతున్నారు. ఏ అధికారైన నిజాయితీ ఉన్న వైపు సహకరించాలి గానీ కబ్జాలు చేస్తున్న వ్యక్తులను కండ్లకు అద్దుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ చరిత్రలో మొట్టమొదటిసారిగా చూస్తున్నామని తీవ్రంగా మండిపడుతున్నారు. కబ్జా భూములపై పట్టాదారు సమర్పిస్తున్న పత్రాలను ఏ ఒక్క అధికారి విచారణ చేపట్టడం లేదని పైగా వాళ్లపై అకారణంగా కేసులు కట్టడంలో మాత్రం కేయూ ఎస్సై బొజ్జ రవీందర్ రూపంలో తీరని అన్యాయం తీరని నష్టం చేస్తూ పట్టాదారులపై విచ్చలవిడి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని మండిపడుతున్నారు. 15 సంవత్సరాలుగా కొనసాగుతున్న భూవివాదంలో జిల్లాకు చెందిన అందరు ప్రముఖ రెవెన్యూ అధికారులతో రాష్ట్ర రెవెన్యూ అధికారులు, హైకోర్టు తీర్పులు, పట్టాదారులకు అనుకూలమైన ఉత్తర్వులను ఇచ్చినప్పటికినీ అక్రమంగా క్రిమినల్ కేసులు కట్టి విచారణ రూపంలో పట్టాదారులను భయపెట్టిస్తున్న ఎస్సై బొజ్జ రవీందర్ జిల్లా కలెక్టర్ నివేదన నివేదికను కాలి బూటు కింద బూడిదతో సమానంగా చూస్తున్నాడే తప్ప ఏం విచారణ చేశాడని ఇప్పటికి బయట పెట్టకపోవడం పట్టాదారుల భూమి కబ్జాలు చేయబడుటకు ప్రధాన కారణంగా మారిపోయింది అంటున్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తే తప్ప పట్టాదారులైన ముస్లింలకు న్యాయం జరిగేలా లేదని మున్సిపల్ పోలీస్ అధికారులు ముస్లిం పట్టాదారులను తీవ్రమైన మనస్థాపానికి గురిచేస్తూ ఒక శాఖ అక్రమంగా అనుమతులు ఇవ్వడం మరొక శాఖ అక్రమంగా కేసులు పెడుతుండడం చూస్తుంటే పట్టాదారులను బొందపెట్టైన కబ్జాలు నిర్వహించి ఇల్లు కట్టుకొని అమ్ముకోవాలని దుర్బుద్ధి మాత్రం 15 ఏళ్లుగా మానకపోతుండడం తీవ్రమైన నేరంగా భావించాలని పట్టాదారులు అంటున్నారు. కేసులపై విచారించిన ఆధారాలను ఒక్కటి కూడా బయట పెట్టకుండా పట్టాదారులపై ఉక్కు పాదం మోపడం బహుశా రాష్ట్ర చరిత్రలో కేయూ పోలీస్ స్టేషన్ కే దక్కుతుందేమోనని ఇలాంటి పోలీస్ ఎస్సై బొజ్జ రవీందర్ చే వేధింపులకు పాల్పడుతున్న పోలీసు ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు బట్టి శ్రీనుకు పట్టాదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే ముస్లింలకు సహకారంగా అభివృద్ధి పరంగా ఉంటామని తెలియజేస్తూనే తన నాయకులు చేయిస్తున్న కబ్జాలను మాత్రం ఏమాత్రం పట్టించుకోకపోవడం చూస్తుంటే నిజాయితీగా రాస్తున్న వార్తలను కూడా పట్టించుకోకుండా పరిపాలన చేస్తుండడం రాష్ట్ర శాంతిభద్రతలకు విఘాతం కల్పించడమేనని పట్టాదారులు తీవ్ర మనస్తాపం చెందుతున్నారు. ఇట్టి భూకబ్జా విషయమై జై భీమ్ సంస్థ రాష్ట్ర ప్రతినిధి బట్టి శ్రీనుకు వివరణ కోసం పలుమార్లు ఫోన్ చేయగా స్పందించలేదు. పట్టాదారులు మాత్రం మొండిపట్టుతో భట్టి శ్రీను బహిరంగ చర్చకు రావాల్సిందేనంటూ సవాల్ విసురుతున్నారు. ఇలాంటి భూకబ్జాలకు సహకరిస్తున్న భట్టి శ్రీను లాంటి వ్యక్తిని వరంగల్ వెస్ట్ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యేలు రాష్ట్ర మంత్రులు ప్రజాప్రతినిధులు ఎలా పొంచి పోషిస్తున్నారో ఆత్మ విమర్శలు చేసుకోవాలని పట్టాదారులు కోరుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భ్రష్టు పట్టిస్తున్న భూకబ్జాదారులు త్వరలో...

# రేంవత్ సభలకు జనం కరువు





### కొడంగల్ నుంచి జనాలను రప్పిస్తున్నారు
### జూబ్లీహిల్స్ ప్రచారంలో హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,నవంబర్ 8(జై భీమ్ న్యూస్ ):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి కర్రు కల్చి వాత పెట్టబోతున్నారని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రి రోడ్ షోలకు జూబ్లీహిల్స్ ప్రజలు రావడం లేదని తన సొంత నియోజక వర్గం కొడంగల్ నుంచి జనాలను ఇక్కడికి రేవంత్ రెడ్డి తరలిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు రూ. 2, 500 ఇస్తామన్నారని.. అవి ఇవ్వకుండా ఈ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. మహిళలకు రూ. 2,500 రావాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ఓటర్లకు సూచించారు. హామీలు ఎగ్గొట్టినా గెలిపించారని సీఎం రేవంత్ రెడ్డి మీకు ఇచ్చిన హామీలు అమలు చేయడని వివరించారు. శనివారం సాయంత్రం షేక్ పేట అంబేద్కర్ నగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ.. దురదృష్టం కొద్ది మీరంతా అమితంగా ఇష్టపడి గెలిపించుకున్న మాగంటి గోపీనాథ్ అనారోగ్య కారణంగా చనిపోయారన్నారు. మగదిక్కు లేని ఆ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలబడిందని స్పష్టం చేశారు. గోపీనాథ్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన సతీమణి సునీతకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించిందని గుర్తు చేశారు. అలాంటి వేళ బాధతో.. దు:ఖంతో ఉన్న ఆడబిడ్డ సునీతను కాంగ్రెస్ పార్టీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సునీతమ్మను అవహేళన చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు బుద్ధి చెప్పాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు ఆయన సూచించారు. గోపీనాథ్ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి పేద ప్రజలకు, బస్తీ వాసులకు అండగా నిలిచారని చెప్పారు. నియోజక వర్గం నుంచి ఎదురీతకు లేడీ నిలుచుంటే అటు వైపు రౌడీ నిలబడ్డారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ఎవరు గెలవాలి? లేడీనా? రౌడీనా? అంటూ నియోజకవర్గ ప్రజలను ఈ సందర్భంగా ప్రశ్నించారు. మీ కష్టాలు.. మీ సమస్యల పరిష్కరించేందుకు సునీతమ్మతోపాటు మేమంతా మీకు అండగా ఉంటామని ఈ సందర్భంగా బస్తీ వాసులకు హరీశ్ రావు హామీ ఇచ్చారు.

# రాష్ట్రంలో రహదారులకు మహర్దశ

### రూ.60,799 కోట్లతో రోడ్ల నిర్మాణం
### మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

**హైదరాబాద్,నవంబర్ 8(జై భీమ్ న్యూస్ ):**

రాష్ట్ర వ్యాప్తంగా రహదారులకు మహర్దశ ప ట్టనుందని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. వీటి నిర్మాణానికి సర్కార్ శ్రీకారం చుట్టింది. దాదాపు రూ.60,799 కోట్లతో రోడ్లను నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నిధుల మంజూరు సర్కార్ ఆమోద ముద్ర వేసింది. రహదారుల నిర్మాణానికి నిధుల మంజూరు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ చరిత్రలో ఎన్నడూ లేని రికార్డుగా అభివర్ణించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితో తెలంగాణ బహుళజాతి సంస్థల కేంద్రంగా మారబోతోందని తెలిపారు. హైదరాబాద్ ? విజయవాడ హైవే విస్తరణకు రూ.10,400 కోట్లు కేటాయించడం జరిగిందని... దీనిని ఎనిమిది లైన్లుగా మార్పు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి రూ.36,000 కోట్లు మంజూరు అయ్యిందని.. ఇది రాష్ట్రానికి గేమ్‌చేంజర్ ప్రాజెక్ట్ అని వెల్లడించారు. రహదారులు లేని గ్రామాల్లో కొత్త రోడ్లు, సింగిల్ రోడ్ల స్థానంలో డబుల్ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. హెచ్ఏఎమ్ ప్రాజెక్ట్ కోసం రూ. 11,399 కోట్లు కేటాయించడం జరిగిందని.. ఇందు కోసం త్వరలోనే టెండర్లను పిలువనున్నట్లు చెప్పారు. మన్ననూరు ? శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ 52 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి రూ. 8,000 కోట్లు కేటాయించడం జరిగిందని... అలాగే ఫ్యూచర్ సిటీ? అమరావతి–బందరు పోర్ట్ గ్రీన్ ఫీల్డ్ హైవేకు రూ.20,000 కోట్లు కేటాయించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు.

# ఆట మొదలు పెడతా.. తడాఖా చూపిస్తా

### కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆగం
### మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,నవంబర్ 8(జై భీమ్ న్యూస్ ):**

కాంగ్రెస్ పాలనలో ప్రజలు అవస్థలు పడుతున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. రానున్న రోజుల్లో ఆట మొదలు పెట్టినప్పుడు తానేంటో చూపిస్తానని.. బీఆర్ఎస్, కాంగ్రెస్ కాళ్ల కింద భూమి కదలాలన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. .. తెలంగాణ బిడ్డలు బలిదానం చేసింది కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కాదా అని ప్రశ్నించారు. బలిదానం చేసుకున్నది కేసీఆర్ కుటుంబానికి బానిసలుగా ఉండడం కోసం కాదని తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అధికారం ఉన్నప్పుడు మజ్లిస్ పెత్తనం చేస్తుందని ఆయన ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని అన్నారు. తెలంగాణ ప్రజలు అసలైన మార్పు కోరుకున్నారని కేంద్రమంత్రి తెలిపారు. రెక్కాడితే గానీ డొక్కాడని పేదల ఇళ్ళు కూల్చుతామంటే ప్రాణాలు తెగించి బీజేపీ పోరాడుతోందన్నారు. మూసీ పేరుతో పేదల గూడు కూల్చితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సోషల్ మీడియా చూడాలని.. భాష, పద్ధతి మార్చుకోవాలని ఆ రెండు పార్టీల నేతలకు హితవుపలికారు. అలాగే కేటీఆర్, కిషన్‌రెడ్డిని ఉద్దేశిస్తూ బ్యాడ్ బ్రదర్స్ అంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కూడా కేంద్రమంత్రి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎవరు ఎవరికి బ్రదర్స్ అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పెద్ద బ్రదర్ కేసీఆర్, తర్వాత చిన్న బ్రదర్ హరీశ్ రావు అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రజలకే తాము బ్రదర్స్ అని చెప్పుకొచ్చారు. మునుగోడులో భారత సైనికులను చైనా సైనికులు కొట్టారని కేసీఆర్ అంటే.. జూబ్లీహిల్స్‌లో భారత సైనికులను ముడ్డి మీద తన్నారని రేవంత్ రెడ్డి అంటున్నారని... అసలు పాకిస్థాన్ ఉగ్రవాదులను భారతదేశం ఏం చేసిందో ప్రపంచం అంతా లైవ్‌లో చూసిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# నడిరోడ్డుపై నటుకోళ్లు వదిలారు

### ఎవరికి తోచిన విధంగా వారు ఎత్తుకెళ్లారు

**హన్మకొండ,నవంబర్8(జై భీమ్ న్యూస్ ):**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో గమ్మత్తయిన సంఘటన చోటుచేసుకుంది. రెండు వేల నాటు కోళ్లను గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. సిద్దిపేట–ఎల్కతుర్తి రహదారి వెంట పొలాల్లో వీటిని విడిచిపెట్టారు. దీంతో నాటు కోళ్లను తెచ్చుకోవడం కోసం జనం ఎగబడ్డారు. అందినకాడికి ఇళ్లకు తీసుకెళ్లారు. వీటితో బిర్యానీ వండుకుని ఎంజాయ్ చేశారు. అయితే ఇందులో ఏదైనా కుట్ర కోణం ఉందా అన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే.. ఇంత పెద్దఎత్తున నాటు కోళ్లను ఎవరు, ఎందుకు వదిలిపెట్టారో తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పలు కోళ్లను పశువైద్యాధికారిణి దీపిక వద్దకు తీసుకువెళ్లారు. కోళ్లకు ఎలాంటి వ్యాధి లక్షణాలు లేవని పశువైద్యాధికారిణి తెలిపారు.

# తిరుమల క్షేత్రం లాగా కొండబిట్రగుంట దేవస్థానం అభివృద్ధి

### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**నెల్లూరు,నవంబర్ 8(జై భీమ్ న్యూస్ ) :**

దేవాదాయ శాఖ చట్టంలో త్వరలోనే మార్పులు వస్తాయని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లాలోని బోగోలు మండలం కొండబిట్రగుంటలో రూ.5.38కోట్లతో అభివృద్ధి పనులకి శ్రీకారం చుట్టారు. శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకి మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. కొండబిట్రగుంట దేవస్థానాన్ని రెండో తిరుమల క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. దాతల సహకారంతో ఇప్పటికే రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. కావలి నియోజకవర్గంలో దేవస్థానాల అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ద్వారా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. ధూప, దీప, నైవేద్యాల కోసం 73 దేవస్థానాలకి నెలకి రూ.10వేల చొప్పున సహాయం అందజేస్తున్నామని స్పష్టం చేశారు. దాతలు దేవస్థానాలు నిర్మించేటప్పుడు దేవాదాయ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఆదేశించారు. కొండబిట్రగుంట అభివృద్ధికి మంత్రి ఆనం నిధులు కేటాయించారు: ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కొండబిట్రగుంట అభివృద్ధికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిధులు కేటాయించారని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. ధ్యాన మందిరానికి రూ.23లక్షలు, రథశాలకు ప్రత్యేక నిధుల మంజూరు చేశారని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

# పంటనష్టాన్ని నమోదు చేశాం

### ప్రతీ గ్రామానికి వెళ్లి పంట నష్టం వివరాలు సేకరణ
### వ్యవసాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**రాజమండ్రి,నవంబర్ 8(జై భీమ్ న్యూస్ ) :**

మొంథా తుఫాను వల్ల సంభవించిన పంట నష్టాన్ని నమోదు చేశామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రతీ గ్రామానికి వెళ్లి పంట నష్టం తెలుసుకున్నామని వెల్లడించారు. వరికి హెక్టార్‌కు రూ. 17 వేల పరిహారం వైసీపీ తగ్గించిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో వరిపంటకు నష్టం రూ. 25 వేలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. శనివారం రాజమండ్రిలో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులతో మొంథా తుఫాను పంట నష్టానికి సంబంధించిన విషయాలపై మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. అరటిపంటకు రూ. 35 వేలు నష్టపరిహారం ఇస్తున్నామని తెలిపారు. మొంథా తుఫాను వల్ల నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందజేస్తామని భరోసా కల్పించారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చామని అన్నారు. వైసీపీ హయాంలో రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం కొనుగోలు రూ.1600 కోట్లు బకాయి పెట్టారని ఆరోపించారు అచ్చెన్నాయుడు. తమ ప్రభుత్వంలో సహకార, వ్యవసాయ పరపతి సంఘాలను మరింత బలోపేతం చేస్తామని అన్నారు. జగన్ హయాంలో పరపతి సంఘాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. సహకార, వ్యవసాయ పరపతి సంఘాల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. సహకార, వ్యవసాయ పరపతి సంఘాలపై వైసీపీ పాలనలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని ఏపీ శాసన సభలో ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# వికారాబాద్‌లో రక్తం లేదు

### రక్తం కోసం హైదరాబాద్ వెళ్లాల్సిందే




**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

మనిషి ప్రాణం పోతుంటే బ్లడ్ అవసరం ఉంటే మాత్రం హైదరాబాద్ వెళ్లాల్సిందే అంటే లేకుంటే ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ ను సంప్రదించాల్సిందే. ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ నిర్వహణ పూర్తిగా అధ్వాన్నం. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంక్ ను పట్టించుకునే నాధుడే లేడు, వికారాబాద్ పేరుకే ప్రభుత్వ కొత్త ఆసుపత్రి. వికారాబాద్ పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ గతంలో ఉండేది, ఇప్పుడు కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి షిఫ్ట్ చేశారు. ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ అనే పేరే ఉంటుంది, ఇక్కడ ఏ బ్లడ్ కూడా ఉండదు, నిర్వహణ మాత్రం పూర్తిగా అధ్వాన్నంగా ఉంది. బ్లడ్ బ్యాంక్ నిర్వాహన కోసం ఐదు మంది సిబ్బందిని నియమించినా కూడా బ్లడ్ లేకపోవడంతో చాలామంది రోగులకు కేవలం బ్లడ్ లేకపోవడంతోనే హైదరాబాద్ తీసుకెళ్తున్న పరిస్థితి ఉంది. పలువురు మాట్లాడుతూ... ఒక జిల్లా కేంద్రం ఇంత పెద్ద ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ లేకపోవడం అంటే అర్థం చేసుకోండి వైద్య పరిస్థితి ఎట్లా ఉందో అని జిల్లా ప్రజలు అంటున్నారు.

# వేడెక్కుతున్న బీహార్ ఎన్నికల ప్రచారం

### బీహార్ చేపల కోసం పెద్దపెద్ద వాళ్లు వస్తున్నారు
### రాహుల్ చేపలవేటపై మోడీ వ్యంగ్యాస్త్రాలు

**పాట్నా, నవంబర్ 8 (ఆర్ఎన్ఐ):**

బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికార, విపక్ష పార్టీలు పదునైన వ్యాఖ్యలతో విమర్శలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల చేపలవేట కోసం మత్స్యకారులతో కలిసి చెరువులోకి దిగారు. దానిని ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. బిహార్ చేపలను చూడటానికి పెద్దపెద్దవాళ్లు వస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో మునిగిపోయేందుకు ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. బిహార్‌లో చేపలు పట్టడానికి ఇప్పుడు పెద్దపెద్ద వాళ్లు వస్తున్నారని, కొందరు ఎన్నికల్లో మునిగిపోయేందుకు ప్రాక్టీస్ చేస్తున్నారని ప్రధాని మోదీ ఛలోక్తులు విసిరారు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఇటీవల బిహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు బెగుసరాయి జిల్లాలో మత్స్యకారులతో కలిసి చెరువులోకి దిగడం, చేపలు పట్టడంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లోని సీతామర్హిలో శనివారం నాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, ఒకానొక సమయంలో బిహార్ ఇతర రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి చేపలను సేకరించేదని, కానీ మత్స్యశాఖకు సంబంధించి తాము తీసుకున్న చర్యల కారణంగా బిహార్ ఇప్పుడు చేపల పెంపకంలో స్వయం సమృద్ధిని సాధించిందని చెప్పారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి చేస్తోందని అన్నారు. ఇక్కడి చేపలను చూసేందుకు పెద్దపెద్ద వాళ్లు కూడా వస్తున్నారని, కొందరు చెరువుల్లో డైవింగ్ చేస్తుంటే, మరికొందరు బిహార్ ఎన్నికల్లో మునిగిపోయేందుకు ప్రాక్టీస్ చేస్తున్నారంటూ పరోక్షంగా రాహుల్‌పై సెటైర్ వేశారు. కొన్నిరోజుల క్రితం బెగుసరాయ్ జిల్లాలో మత్స్యకారులతో కలిసి రాహుల్ చేపలు పట్టేందుకు వెళ్లారు. అప్పుడు ఆయన వెంట మాజీ మంత్రి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ వ్యవస్థాపకుడు, విపక్ష కూటమి డిప్యూటీ సీఎం అభ్యర్థి ముకేశ్ సాహ్నీ కూడా ఉన్నారు. చేపలు పట్టేందుకుగానూ సాహ్నీ నీళ్లలోకి దిగి వలవేశారు. కాసేపటికి రాహుల్ గాంధీ సైతం నీళ్లలో దూకారు. మత్స్యకారులతో కలిసి చేపలు పట్టారు. ఈత కొట్టారు. ఆ సందర్భంగా జాలర్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వేట నిషేధిత కాలంలో మత్స్యకారుల కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం, బీమా సదుపాయం, చేపల మార్కెట్‌ల ఏర్పాటు, మత్స్య సంపద కోసం జలవనరుల పునరుద్ధరణ వంటి హామీలు ఇచ్చారని కాంగ్రెస్ వెల్లడించింది.

# న్యూస్ పేపర్‌లో భోజనం వడ్డింపా

### మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై రాహుల్ మండిపాటు

న్యూఢిల్లీ, నవంబర్ 8 (ఆర్ఎన్ఐ): మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు న్యూస్‌పేపర్‌లో మధ్యాహ్న భోజనం వడ్డించినట్లు కనిపిస్తున్న దృశ్యాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ఇది చూసి తన హృదయం తల్లడిల్లిందన్నారు. ఇంత దయనీయ స్థితిలో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని న్యూస్‌పేపర్‌లో వడ్డిస్తున్నట్లు తెలుసుకుని నా హృదయం ముక్కలైంది. ఈ పిల్లలపైనే మన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. కానీ, వారికి కనీస గౌరవం దక్కడం లేదు. అక్కడ అభివృద్ధి అంతా భ్రమే. వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకొని అధికారంలోకి వస్తున్నారు. ఇటువంటి దుర్భర స్థితిలో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. శ్యోపుర్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఈ వీడియో తీసినట్లు సమాచారం. ఈ వ్యవహారం కాస్త నెట్టింట వైరల్‌గా మారడంతో.. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది. స్వయం సహాయక సిబ్బంది సేవలను నిలిపివేశారు. నెటిజన్లు దీన్ని ఖండించారు. మధ్యాహ్న భోజనం అనేది పిల్లల హక్కు అని పేర్కొన్నారు. పోషకాహారం పేరిట అనారోగ్యాన్ని వడ్డిస్తున్నారంటూ విమర్శించారు.

# హెూటల్ మేనేజిమెంట్ అకాడమీలో మత్తు

### గంజా సేవించిన ఆరుగురు విద్యార్థుల అరెస్ట్

హైదరాబాద్, నవంబర్ 8 (ఆర్ఎన్ఐ): డ్రగ్స్ మత్తులో యువత తమ జీవితాలను చిత్తు చేసుకుంటున్నాయి. డ్రగ్స్ ను పూర్తిగా రూపుమాపేందుకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొచ్చి అమలు చేస్తున్నప్పటికీ అడ్డుకట్టపడడం లేదు. తాజాగా హైదరాబాద్ లో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. బేగంపేట్ క్యులినరీ హెూటల్ మేనేజ్‌మెంట్ అకాడమీలో డ్రగ్స్ కలకలం సృష్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురు విద్యార్థులు గంజా సేవించినట్లు పోలీసులు గుర్తించారు. ఆరు మంది విద్యార్థులకు డ్రగ్ టెస్టు నిర్వహించగా పాజిటివ్ వచ్చినట్లు తెలిపారు. ఈగల్, నార్కోటిక్స్ పోలీసులు సంయుక్తంగా విద్యార్థులకు పరీక్షలు చేశారు. పట్టుబడిన వారు చివరి సంవత్సరం చదువుతున్న హెూటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులుగా గుర్తించారు. వారిని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి.. డి–అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు తెలిపారు. విద్యార్థుల స్నేహితుడే డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

# వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించిన డాక్టర్ అప్పయ్య





**హన్మకొండ, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య శనివారం ధర్మసాగర్ మండలంలోని ఖ్యాతంపల్లి, జానకిపురం గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆవుట్ రీచ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. డాక్టర్ అప్పయ్య వ్యాక్సినేషన్ కార్యక్రమ తీరును, డ్యూ లిస్టులు, ఫోర్ కీ మెసేజెస్, ఏఈఎఫ్ఐ కిట్లు పరిశీలించి, గర్భిణీ స్త్రీలు మరియు చిన్నారులకు అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. తరువాత ఆయన ధర్మసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఫార్మసీ, మందుల నిల్వలు, ఏఆర్వీ వ్యాక్సిన్ స్టాక్‌లను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాల్లో ఉన్న పనికిరాని మొక్కలను గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అదనంగా, 24 గంటల మాతా%-%శిశు సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించి, గర్భిణీ స్త్రీలకు నమ్మకం కలిగించేలా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అరుణ, పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ శృతి, నర్సింగ్ ఆఫీసర్లు, సేవ్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన మహిళలు, పిల్లలకు సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కృషి చేయాలి

కలెక్టర్ డాక్టర్ సత్య శారద





**వరంగల్, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన మహిళలు, పిల్లలకు సమర్థంగా చేరేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. శనివారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, పూర్వ ప్రాథమిక విద్య, గర్భిణీ బాలింతల సేవలు, మిషన్ వాత్సల్య, శిశు సంరక్షణ కేంద్రాలు, బాల్యవివాహాల నిర్మూలన, బేటీ బచావో బేటీ పడావో, చైల్డ్ హెల్ప్‌లైన్ వంటి కార్యక్రమాల అమలు తీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం కింద 2025-26 కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో గీజర్లు ఏర్పాటు చేయాలని, అలాగే మహిళా, శిశు సంక్షేమ, యువజన-క్రీడల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మూడు నెలలపాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు 20 పాఠశాలల్లో నిర్వహించాలన్నారు. బేటీ బచావో-బేటీ పడావోలో భాగంగా వందమంది కేజీబీవీ విద్యార్థులను నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌కు తీసుకెళ్లే పర్యటన ఏర్పాటు చేయాలని సూచించారు. బాల, బాలికల లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న 100 గ్రామాల్లో నిష్పత్తి సూచించే బోర్డులు గ్రామపంచాయతీలలో ప్రదర్శించాలని ఆదేశించారు. అడ్వెంచర్ కార్యకలాపాల భాగంగా ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులను పాకాల సరస్సు, బటర్ఫ్లై పార్క్‌లకు పర్యటనకు తీసుకెళ్లాలని అన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో తాగునీరు, టాయిలెట్ వంటి కనీస వసతులు డిసెంబర్ 15 నాటికి అందుబాటులోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నశా ముక్త్ భారత్ అభియాన్ కింద ఎక్సైజ్, వైద్య ఆరోగ్య శాఖలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీఆర్డీఓ రామిరెడ్డి, జిడబ్ల్యూఓ రాజమణి, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఇజ్జగిరి, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు పుష్పలత, జిల్లా క్రీడల అధికారి అనిల్ భాగ్యలక్ష్మి, అలాగే సిడిపీఓలు మధురిమ, విద్య, సఖి, చైల్డ్ హెల్ప్‌లైన్, పోషణ అభియాన్, డిహెచ్ఈడబ్ల్యూ సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో ఘనంగా సప్తశక్తి సంగం

**హన్మకొండ, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ పద్మాక్షి కాలనీలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో శనివారం ఉదయం మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన సప్తశక్తి సంగం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యురాలు, రాష్ట్ర సేవికా సమితి నాయకురాలు డాక్టర్ మాగంటి అరుణ అధ్యక్షత వహించగా, రిటైర్డ్ ఏఎంఓ బోయినపల్లి రాధ, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు సందివెన మంజుల వాణి ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. ముందుగా బోయినపల్లి రాధ మాట్లాడుతూ, భారతదేశ అభివృద్ధిలో మహిళల పాత్ర అమూల్యం అని పేర్కొన్నారు. హద్దులు లేని వాత్సల్యమే మాతృత్వంబీ మాతృత్వ భావన కలిగిన ప్రతి ఒక్కరినీ తల్లి అంటారు అని ఆమె అభిప్రాయపడ్డారు. తరువాత మంజుల వాణి మాట్లాడుతూ, భారతీయ జీవన వ్యవస్థలోని నాలుగు ఆశ్రమ ధర్మాలు కుటుంబ వ్యవస్థనే పునాదిగా కలిగి ఉన్నాయని చెప్పారు. కుటుంబాలను సంరక్షించడం మహిళల ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, పర్యావరణ స్పృహతో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని మహిళలకు సూచించారు. ముఖ్య అతిథి డాక్టర్ మాగంటి అరుణ మాట్లాడుతూ, పిల్లల మనసుల్లో ఇంటి పనుల పట్ల గౌరవం, అందరితో కలిసి సహజంగా భోజనం చేయాలనే అలవాటు పెంపొందించాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు ఊకంటి మున్నెమ్మ, పాఠశాల ఆచార్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, హితయిషులు, ప్రబంధక సభ్యులు, మరియు ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## రెండు వేల నాటు కోళ్లు ఒక్కసారిగా ప్రత్యక్షం ఎల్కతుర్తిలో ఉత్సాహం వెల్లువ!

గుర్తు తెలియని వ్యక్తుల 'గిఫ్ట్'తో ఊరంతా పండుగ వాతావరణం

**ఎల్కతుర్తి, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

నాటుకోడి కూర అంటే దానికంటూ ప్రత్యేక రుచి అని చెప్పే వారు చాలామంది ఉంటారు. కానీ ఆ కోడి వండుకునే అవకాశం గ్రామానికి ఇలా బహుమతిగా వస్తుందని ఎవరికీ ఊహ లేదు! హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో శనివారం ఉదయం అపూర్వ దృశ్యం కనబడింది. సిద్దిపేట%-%ఎల్కతుర్తి రహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు దాదాపు రెండు వేల నాటు కోళు వదిలివెళ్లారు. ఒక్కసారిగా రోడ్డంతా కూకలతో, రెక్కల చప్పుడు, ధూళి గాలితో కళకళలాడిపోయింది. ఆ దృశ్యం చూసిన గ్రామస్తులంతా క్షణాల్లో అక్కడికి పరుగులు తీశారు. ఏం జరిగిందో చూడాలి అనుకున్నవాళ్లు కూడా చూసేసరికి చేతిలో ఒక్కో కోడి పట్టుకుని నవ్వుతూ కనిపించారు. కొందరు మోసెల్లో, సంచుల్లో, ఇంకొందరు తలకాయలపై వేసుకుని ఇంటికి తీసుకెళ్లారు. చాలామంది కోళ్లను చూసి కళ్ళు నమ్మలేకపోయారు. "దేవుడు పంపాడేమో" అని కొందరు సరదాగా మాట్లాడుకుంటే, ఇంకొందరు ఇవన్నీ మా భోజన పథకం కోళ్లు కావొచ్చు! అంటూ జోకులు పేల్చారు. గ్రామంలో కొద్దిసేపట్లోనే వంట పొగలు ఎగసి పండుగ వాతావరణం నెలకొంది. పిల్లలు కోళ్లను వెంటాడుతూ ఆటపాటల్లో మునిగిపోయారు. పెద్దవాళ్లు మాత్రం కోడి కూర వండుకునే ఏర్పాట్లలో బిజీ అయ్యారు. ఇంత పెద్ద అదృష్టం మా ఊరికి వస్తుందని ఊహించలేదు. ఒక్కరోజులో పండుగ వాతావరణం వచ్చేసింది అని గ్రామస్తుడు ముత్తయ్య నవ్వుతూ చెప్పాడు. మరోవైపు, ఆ కోళ్లను ఎవరు వదిలారనే అంశం మాత్రం ఇంకా మిస్టరీగానే ఉంది. కొందరు వ్యాపారులు తరలింపులో పొరపాటున వదిలివేసి ఉండొచ్చని అంటుంటే, మరికొందరు పక్షుల వ్యాధి భయంతో ఎవరో వదిలేసి ఉండొచ్చు అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఈ ఘటనను మొబైల్ ఫోన్లలో వీడియో తీయడంతో, క్లిప్‌లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఎల్కతుర్తిలో కోళ్లు వర్షంలా కురిశాయి అంటూ నెటిజన్లు సరదాగా కామెంట్లు పెడుతున్నారు. ఇంతలో అధికారులు కూడా ఈ విషయం తెలుసుకుని విచారణకు సిద్ధమయ్యారు. ఒక్కసారిగా రెండు వేల నాటు కోళ్లు ఎలా రహదారిపైకి వచ్చాయో, ఎక్కడి నుంచి తరలించబడాయో తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏదేమైనా, ఈ సంఘటనతో ఎల్కతుర్తి గ్రామం ఒకరోజు మొత్తం కోడి కూర వాసనలో మునిగిపోయింది. అందుకే అందరూ నవ్వుతూ అంటున్నారు... మా ఊరికి ఈరోజు నిజంగా నాటు పండుగే వచ్చింది!

## భద్రకాళి దేవస్థానంలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ ధర్మకర్తలు

**వరంగల్, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా వరంగల్‌లోని ప్రసిద్ధ భద్రకాళి దేవస్థానంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు భద్రకాళి శేషు, ఈవో శ్రీమతి రామల సునీత, ఆలయ ధర్మకర్తలు తోనుపునూరి వీరన్న, మోత్కూరి మయూరి, రామేశ్వరరావు, ఐఎన్టియుసి హనుమకొండ జిల్లా అధ్యక్షులు కూర వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వరంగల్ కోశాధికారి గోల్డ్ వెంకన్న, పిల్లలమర్రి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీర్ఘాయుష్షు, ప్రజా సేవలో మరింత విజయవంతం కావాలని దేవతా ప్రార్థనలు చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి ఆరోగ్యంతో దీర్ఘాయుష్మంతులు కావాలని మంత్రోచ్చారణల మధ్య పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.



## వీధి కుక్కలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

ఆసుపత్రులు, పాఠశాలలు, బస్టాండ్లలో కనిపిస్తే తరలించాలి



**న్యూ ఢిల్లీ, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రజలు అధికంగా ఉండే ఆసుపత్రులు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు వంటి ప్రాంతాల్లో వీధి కుక్కలు కనిపించకుండా చూడాలని ఆదేశించింది. ఒకవేళ అక్కడ కనిపిస్తే వాటిని షెల్టర్ హోమ్‌లకు తరలించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అలాగే పాఠశాలలు, కళాశాలలు, క్రీడా ప్రాంగణాలు, ఇతర పబ్లిక్ ప్రదేశాలు వద్ద కూడా వీధి కుక్కలు ఉండకూడదని, అవసరమైతే కంచెలు ఏర్పాటు చేసి చొరబడకుండా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. కేవలం పట్టుకోవడం సరిపోదని, వాటిని సురక్షితమైన షెల్టర్లకు తరలించడం ప్రభుత్వాల బాధ్యతగా పేర్కొంది. ప్రజా భద్రత కోసం అధికార యంత్రాంగం క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. జంతు ప్రేమికుల ఆందోళన ఇదే అంశంపై ఇటీవల ఢిల్లీలో వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రేమికులు ఆందోళనలు చేపట్టారు. మూగజీవుల రక్షణకోసం సుప్రీంకోర్టు నిర్ణయాన్ని పునరాలోచించాలని కోరారు. ప్రముఖులు, సెలబ్రిటీలు కూడా ఈ విషయంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో జంతు ప్రేమికుల స్పందనపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

## మహారాష్ట్రలో భారీ కుంభకోణం!?

మంత్రి ప్రతాప్ సర్‌నాయక్‌పై ప్రతిపక్షాల ఆరోపణలు

**భయాందర్, నవంబర్8(జై భీమ్ న్యూస్):**

మహారాష్ట్రలో రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ రూ. 200 కోట్ల విలువైన భూమిని రూ. 3 కోట్లకే దక్కించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ భూకుంభకోణం కేసు ఇప్పటికే రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతుండగా, తాజాగా రాష్ట్ర మంత్రిపై వచ్చిన ఆరోపణలు సంచలనంగా మారాయి. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు విజయ్ వడెట్టివార్ విలేకరులతో మాట్లాడుతూ, ప్రతాప్ సర్‌నాయక్ మీరా భయాందర్‌లో దాదాపు రూ. 200 కోట్ల విలువైన నాలుగు ఎకరాల భూమిని రూ. 3 కోట్లకే కొనుగోలు చేశారని ఆరోపించారు. ఆ స్థలలోనే ఆయన ఓ విద్యా సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆరోపణలపై మహారాష్ట్ర రెవెన్యూమంత్రి చంద్రశేఖర్ బవాంకులే స్పందించారు. ఈ విషయం గురించి తాను కూడా విన్నానని, కానీ దీనిపై ఎవరి దగ్గరి నుంచి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ప్రతిపక్షాలు తమకు ఫిర్యాదు చేయడం మానేసి, మీడియా ముందుకు వచ్చి ఆరోపణలు చేసేందుకే సమయం కేటాయిస్తున్నాయని విమర్శించారు. ఈ భూమికి సంబంధించి ఏదైనా ఫిర్యాదు అందితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, రూ. 18,000 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్‌కు చెందిన సంస్థకు రూ. 300 కోట్లకే విక్రయించినట్లు కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై దర్యాప్తునకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసింది. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మంత్రిపై కూడా ఆరోపణలు రావడం గమనార్హం.

# సుజాత విద్యా నికేతన్ గర్వకారణం

**పూర్వ విద్యార్థిని పప్పుల సౌఖ్య ప్రభుత్వ ఉద్యోగం**

**హసన్ పర్తి, నవంబర్ 8(జై భీమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లా హసన్ పర్తి ప్రాంతంలోని ప్రసిద్ధ విద్యాసంస్థ సుజాత విద్యా నికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థిని పప్పుల సౌఖ్య (తండ్రి బిక్షపతి), రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖలో లైసెన్స్ సర్వేయర్ ((గ్రూప్-2) హోదాలో ఉద్యోగం సాధించడం పాఠశాల, ఉపాధ్యాయ వర్గాలు, సహ విద్యార్థులలో ఆనందాన్ని నింపింది. పప్పుల సౌఖ్య ప్రతిభ, కృషి, క్రమశిక్షణతో చదువులో ప్రతిభ కనబరిచి, ఉన్నత స్థానాన్ని దక్కించుకోవడం ద్వారా సుజాత విద్యా నికేతన్ పాఠశాలకు గౌరవాన్ని తీసుకువచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ం మా విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా, జీవితంలో ప్రతి రంగంలో రాణిస్తూ సమాజానికి సేవ చేయడం మా పాఠశాల దిశా నిర్దేశకతకు ప్రతిబింబం. పప్పుల సౌఖ్య ప్రభుత్వ ఉద్యోగం సాధించడం మా అందరికీ గర్వకారణం. భవిష్యత్తులో కూడా ఆమె మరింత ఉన్నత స్థానాలు సంపాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం, అని తెలిపారు. పాఠశాల బోధనా విధానాలు, నిబద్ధతతో కూడిన ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల శ్రద్ధ, తల్లిదండ్రుల సహకారంతోనే ఇలాంటి ఫలితాలు సాధ్యమవుతున్నాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఇప్పటివరకు మా పాఠశాలలో చదివిన వేలమంది విద్యార్థులు (99%) ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో వివిధ హోదాల్లో ఉద్యోగాలు పొందారు. వారు దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావడం పాఠశాలకే గర్వకారణం. విద్యార్థుల సమగ్ర వికాసానికి మా పాఠశాల మరింత అంకితభావంతో కృషి చేస్తుంది, అని సుజాత విద్యా నికేతన్ నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రస్తుత విద్యార్థులు పప్పుల సౌఖ్యకు శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి





**హన్మకొండ, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా పరిధిలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి, కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతున్నదా అని విచారించారు. రైతులతో మాట్లాడుతూ, ధాన్యం తూకాలు, చెల్లింపులు పారదర్శకంగా జరగాలని, ఏ ఆలస్యం లేకుండా రైతుల నుండి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. అదనంగా, కేంద్రాల వద్ద తగిన వసతులు, గింజల ఆరబెట్టే ప్రదేశం, తూకం యంత్రాలు, సంచుల సరఫరా వంటి అంశాలను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు.

## మైసమ్మ ఆలయాల విధ్వంసంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పెదపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**గోదావరిఖని ఘటనపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎంపీ ప్రశ్నించారు**

**పెదపల్లి, నవంబర్ 8(జై భీమ్ న్యూస్)**



గోదావరిఖని పట్టణంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా అధికారుల తీరుపై పెదపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ పరిధిలో సుమారు 48 మైసమ్మ ఆలయాలను కూల్చివేయడం పట్ల ఆయన తీవ్రంగా స్పందించారు. భక్తులు, స్థానిక ప్రజలు పూజించే సాంప్రదాయ దేవాలయాలను ధ్వంసం చేయడం కేవలం భక్తి విశ్వాసాలను అవమానపరచడమే కాకుండా, ప్రజల ఆధ్యాత్మిక విలువలను దెబ్బతీసే చర్య అని ఎంపీ అన్నారు. ప్రజల భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇలాంటి చర్యలు చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని ఆయన వ్యాఖ్యానించారు. భక్తుల మనోభావాలను గౌరవించడం ప్రతి ప్రభుత్వపు నైతిక బాధ్యత. అధికారుల పేరుతో ఈ విధంగా ఆలయాలపై చర్యలు తీసుకోవడం అన్యాయమే కాకుండా, ప్రజల విశ్వాసంపై దెబ్బతీయడమే.

**బాధ్యులైన అధికారులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి**

అని వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ ఘటనను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, అంతేకాక జిల్లా మంత్రివర్యులు శ్రీధర్ బాబు వెంటనే స్పందించాలని కోరారు. గోదావరిఖని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి భావాలను అర్థం చేసుకుని ప్రభుత్వం న్యాయం చేయాలి. లేకపోతే ప్రజా ఆగ్రహం పెరుగుతుంది, అని ఎంపీ హెచ్చరించారు. గోదావరిఖని పట్టణంలో ఆలయాల కూల్చివేత ఘటనపై భక్తులు, స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, ఎంపీ వంశీకృష్ణ గారి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో, ప్రజా వేదికల్లో చర్చకు దారి తీశాయి.

## రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి - కలెక్టర్ డా. సత్యశారదా





**వరంగల్ జిల్లా / పర్వతగిరి, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

రైతులు తమ పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. శనివారం పర్వతగిరి మండలంలోని మాల్యా తండా, ఏనుగల్లు, చౌటపల్లి గ్రామాల్లో ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులు పోసిన ధాన్యం కుప్పలను స్వయంగా పరిశీలించి, ధాన్యం తేమ శాతం కూడా తనిఖీ చేశారు. స్థానికంగా కల్పించిన వసతులపై రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు తమ సమీపంలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధరను పొందాలి. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలి, అని నిర్వాహకులను ఆదేశించారు. కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంట వివరాలను ఆదివారం లోగా నమోదు చేసుకోవాలని రైతులను కలెక్టర్ కోరారు. అలాగే, వ్యవసాయ అధికారులు ఏ ఒక్క అర్హుడైన రైతు నష్టం నమోదు కాకుండా మిగలకుండా ఆదివారం లోపల పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ, ఇంచార్జ్ డిఆర్డీఓ రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఐకేపి సిబ్బంది, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో ఘనంగా జోనల్ స్పోర్ట్స్ మీట్

**క్రీడలు క్రమశిక్షణ, నాయకత్వం నేర్పుతాయి : అతిథులు**
**ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి**






**హన్మకొండ, నవంబర్ 8(జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నారాయణ పాఠశాల కాజీపేట బ్రాంచ్‌లో వరంగల్ జోనల్ స్థాయిలో నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా వరంగల్ జోనల్ డీజీఎం రిజ్వానా ఇమ్రాన్, హన్మకొండ ఎంఈఓ నెహ్రూ నాయక్ హాజరయ్యారు. రిజ్వానా ఇమ్రాన్ మాట్లాడుతూ ం క్రీడలు కేవలం శారీరక బలానికే కాదు, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సమయస్ఫూర్తి వంటి విలువలను నేర్పుతాయి. క్రీడలు మనల్ని ఆరోగ్యంగా ఉంచి, ఒత్తిడిని తగ్గించి మానసిక దృఢత్వాన్ని పెంచుతాయి. గెలుపు-ఓటములు సహజం, కానీ ఓడినప్పుడు నిరుత్సాహపడకుండా మళ్లీ ప్రయత్నించడం నిజమైన క్రీడాస్ఫూర్తి అని అన్నారు. ఎంఈఓ నెహ్రూ నాయక్ మాట్లాడుతూ ం నేటి యువత క్రీడల్లో రాణించడం అత్యంత అవసరం. క్రీడలలో పాల్గొనడం ద్వారా భారతదేశం క్రీడా రంగంలో ఎదగడానికి మార్గం సుగమం అవుతుంది. పాల్గొనే ప్రతి విద్యార్థి క్రీడాస్ఫూర్తితో ఆడాలి అని సూచించారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన కాజీపేట ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ – ఇప్పటి కాలంలో చదువు ఒక్కటే సరిపోదు. క్రీడలు కూడా సమాన ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి. ఇటీవల మహిళల క్రికెట్ ప్రపంచ కప్ మనకు స్ఫూర్తి. విద్యార్థులు అకడమిక్స్‌తో పాటు క్రీడల్లోనూ రాణించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను చెడు వ్యసనాల నుండి దూరంగా ఉంచి, వారి ఆసక్తిని గుర్తించి ప్రోత్సహించాలి అని సూచించారు. తరువాత విజేతలకు కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలేఖ్య, తేజవత్ అనిత, ఫర్హానా, మమత, జోనల్ కోఆర్డినేటర్లు ఆకుల సాయికృష్ణ, శ్యామల, శిరీష, అకడమిక్ డీన్లు రాకేష్, విక్రమ్, రాజశేఖర్, వెంకన్న, సాఫ్ట్ స్కిల్ ఉపాధ్యాయులు వీణా కుమారి, సాయిచరణ్, పీఈటీలు ఘనశ్యామ్, మహేష్, శ్రవణ్, బాలకృష్ణ, ఏఓలు చేరాలు, ఆదిల్, అన్వర్, రాజకుమార్, కంప్యూటర్ ఆపరేటర్ హ్యారీ రాజన్, అకౌంటెంట్ రాణి తదితరులు పాల్గొన్నారు. నాలుగు బ్రాంచ్‌ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అంబాల గ్రామ అభివృద్ధికి యువతతో ప్రజలంతా ముందుకు రావాలి

**శివాలయ పునర్నిర్మాణ కమిటీ విజ్ఞప్తి**

**అంబాల, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

అంబాల గ్రామ అభివృద్ధికి గ్రామ ప్రజలు, ముఖ్యంగా యువత ముందుకు రావాలని శివాలయ పునర్నిర్మాణ కమిటీ విజ్ఞప్తి చేసింది. గ్రామంలోని సహజ వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ, వాటిని సరైన విధంగా వినియోగించకపోవడం వల్ల గ్రామ అభివృద్ధి నిలిచిపోయిందని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న శ్రీ శివాలయం పునర్నిర్మాణ పనులు ఆగిపోవడం, ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆలస్యం అవడం గ్రామ ప్రజల్లో ఆవేదనకు కారణమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడటం, పాలనలో ఖాళీ నెలకొనడం, నిధుల కొరత వంటి కారణాల వల్ల గ్రామ అభివృద్ధి ఆగిపోయినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు ఏకతాటిపైకి వచ్చి తమ వంతు సహాయం అందించాలని వారు కోరారు. మన గ్రామానికి ఉన్న సహజ వనరులు ం ఇసుక, కంకర, మొరం వంటి వనరుల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామాభివృద్ధి పనులకు వినియోగించాలి. ముఖ్యంగా శివాలయ పునర్నిర్మాణాన్ని పూర్తిచేయడానికి యువతే ముందుండాలి, అని శివాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు అన్నారు. అలాగే వారు యువతను ఉద్దేశించి మాట్లాడుతూ యువతే గ్రామ భవిష్యత్తు. మీరు ముందుకు వస్తే అంబాల అభివృద్ధికి కొత్త ఊపు వస్తుంది. ప్రతి ఒక్కరు ఆర్థిక సహాయం, శ్రమదానం, సేవదానం రూపంలో భాగస్వామ్యం కావాలి, అని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు ఏకతా భావంతో పనిచేస్తే అంబాల గ్రామం ఆదర్శ గ్రామంగా మారుతుందని, ఆలయ పునర్నిర్మాణం గ్రామ గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని కమిటీ సభ్యులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## బీహార్‌లో ఎన్నికల ఫలితాల తర్వాతే నిర్ణయం

**హైదరాబాద్,నవంబర్8(జై భీమ్ న్యూస్) :**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత, ఒకవేళ హంగ్ అసెంబ్లీ ఏర్పడితేనే మహాకూటమితో కలిసే విషయంపై నిర్ణయం తీసుకుంటామని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ పూర్తి దృష్టి తమ అభ్యర్థులను గరిష్ఠ సంఖ్యలో గెలిపించడంపైనే ఉందని ఆయన తెలిపారు. ఎన్డీటీవీకి ఇచ్చిన 'వాక్ ది టాక్' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "నవంబర్ 14న ఏం జరుగుతుందో నాకు తెలియదు. ఒకవేళ హంగ్ ఏర్పడితే, అప్పుడు కచ్చితంగా స్పందిస్తాం. మా కూటమి అభ్యర్థులు వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో గెలిచేలా చూడటమే మా ప్రయత్నం. ఫలితాలు వచ్చినప్పుడు బీహార్ ప్రజల తీర్పు ఎలా ఉందో చూస్తాం" అని ఒవైసీ వివరించారు. బీహార్‌లోని ప్రతిపక్ష కూటమిలో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు ప్రధాన భాగస్వాములుగా ఉండగా, ఎన్డీఏలో బీజేపీ, జేడీయూ, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), హిందుస్థానీ అవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ మోర్చా పార్టీలు ఉన్నాయి. 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం 19 స్థానాల్లో పోటీ చేసి, ముస్లిం జనాభా అధికంగా ఉండే సీమాంచల్ ప్రాంతంలో ఐదు స్థానాలు గెలుచుకుంది.

జై భీమ్ POWER OF PEOPLE | Jai Bheem

# వ్యాధి నిరోధక టీకాలు సమయానికి వేయాలని సూచించిన డీఎంహెచ్ఓ డాక్టర్ బి. సాంబశివరావు

**అల్లిపురంలో ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ కార్యకలాపాలపై పర్యటన**




**వరంగల్, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు నేడు ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ - తిమ్మాపూర్ పరిధిలోని అల్లిపురం గ్రామంలో పర్యటించి, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టిన బిడ్డ నుండి 18 సంవత్సరాల వయస్సు వరకు తీసుకోవలసిన వ్యాధి నిరోధక టీకాలను షెడ్యూల్ ప్రకారం సమయానికి వేయాలని, అర్హత కలిగిన ప్రతి బిడ్డకు మరియు గర్భిణీ స్త్రీకి టీకాలు తప్పనిసరిగా వేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్రజలందరూ స్వచ్ఛందంగా వ్యాధి నిరోధక టీకాలు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని, టీకాలు తీసుకోకపోవడం వల్ల రోగాలు వ్యాపించే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య లక్ష్యాలను విజయవంతంగా చేరుకోవాలన్నది తన ఆకాంక్షగా పేర్కొన్నారు. అసంక్రమిత మరియు సంక్రమిత వ్యాధులను ముందుగానే గుర్తించి వాటి వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయాలని, తద్వారా సమయానికి తగిన చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా ఇంటింటి సర్వే ద్వారా జ్వర వ్యాధిగ్రస్తులను గుర్తించి, పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి రోజు సేకరించిన వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. డీఎంహెచ్ఓ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ౹ ఆశా కార్యకర్తల నుండి వైద్యాధికారుల వరకు ప్రతీ ఒక్కరూ తమ విధులను సమయానికి నిర్వర్తించాలి. సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలి అని సూచించారు. ప్రజలు కూడా ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటించి, స్వచ్ఛత పాటించి, వ్యాధుల నుండి దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి, ఆరోగ్య కార్యకర్త సీసీ నాగరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళి



**జనగామ, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండల కేంద్రంలో ఈ సంవత్సరం ప్రారంభమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల యొక్క ఎఫ్ఎసి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి, శనివారం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చంద్రమౌళి, కళాశాల స్థాపనలో చేసిన సహకారం పట్ల ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, కొత్తగా ప్రారంభించిన ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కళాశాలకు శాశ్వత భవన నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి అని తెలిపారు. అలాగే కళాశాల ప్రగతికి, విద్యార్థుల అవసరాల తీర్చడంలో ప్రభుత్వ సహకారం నిరంతరం లభిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. కళాశాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలి అని ప్రిన్సిపాల్‌కు సూచించారు. కడియం శ్రీహరిని కలిసిన వారిలో పింగిళి కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుహాసిని, గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల పూర్వ అధ్యక్షులు డాక్టర్ సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి హరీష్ కుటుంబానికి ఇళ్లు మంజూరు చేయాలని అడిషనల్ కలెక్టర్‌కు వినతి

**టీఆర్‌పీ రాష్ట్ర యువ నాయకుడు వరిపల్లి అనిల్ కుమార్**



**మహబూబాబాద్ జిల్లా, నెల్లికుదూరు, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

నెల్లికుదూరు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం గొల్లపల్లి హరీష్ కుటుంబానికి ప్రభుత్వం ఇప్పటివరకు ఇల్లు మంజూరు చేయకపోవడం బాధాకరమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) రాష్ట్ర యువ నాయకుడు వరిపల్లి అనిల్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో హరీష్ కుటుంబానికి తక్షణమే ఇళ్ల మంజూరు చేయాలని కోరుతూ అడిషనల్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ త్వరలో విచారణ జరిపించి అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేస్తాం అని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో అర్హత కలిగిన కుటుంబాలకు ఇళు ్ల అందకపోవడం బాధాకరమని పేర్కొన్న వరిపల్లి అనిల్ కుమార్, హరీష్ కుటుంబానికి ఇళ్లు మంజూరు అయ్యే వరకు టీఆర్‌పీ పార్టీ కృషి చేస్తుంది. వారి కుటుంబానికి భరోసాగా టీఆర్‌పీ అండగా ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌పీ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెంజ్ ఉన్నా గంజికే కనెక్ట్ అయ్యా

**బెంజ్‌లో తిరిగినా గతాన్ని మరిచిపోవద్దు**

**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**హైదరాబాద్,నవంబర్8(జై భీమ్ న్యూస్):**

బెంజ్ కారులో తిరిగే స్థోమత ఉన్నప్పటికీ తాను గంజికే కనెక్ట్ అయిన వ్యక్తినని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఒకప్పుడు గంజి తాగిన వాళ్లు ఆ తర్వాత కారులో తిరుగుతూ తాము గతంలో గడిపిన జీవితాన్ని మరిచిపోతున్నారని ఆయన అన్నారు.శనివారం సంగారెడ్డిలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తన మిత్రులతో సరదాగా మాట్లాడుతూ, దేశం, రాష్ట్రంలో ఇది పెద్ద సమస్యగా మారిందని ఆయన అన్నారు. గంజి తాగి బతికిన వాళ్లు బెంజ్‌లో తిరిగినప్పటికీ గతాన్ని మరిచిపోకూడదని ఆయన అన్నారు.

## కులాంతర వివాహాల వేదిక జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

**కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ పిలుపు**




**హన్మకొండ, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

దేశవ్యాప్తంగా కులాంతర వివాహాలకు రక్షణ కల్పించాలనే డిమాండ్‌తో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో రేపు హైదరాబాద్‌లో జరగబోయే కులాంతర వివాహాల వేదిక జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ రాంనగర్ సుందరయ్య భవన్‌లో జిల్లా కార్యాలయంలో కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన మంద సంపత్, కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రస్తుతం సరైన రక్షణ లేకుండా పోతోంది. వారికి భద్రత, చట్టపరమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం తక్షణమే కులాంతర వివాహాల రక్షణ చట్టం తీసుకురావాలి అని డిమాండ్ చేశారు. అయన మరింతగా మాట్లాడుతూ ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న జంటలతో కలిసి హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ సమ్మేళనం నిర్వహిస్తున్నాం. అందరూ పాల్గొని తమ సమస్యలను, డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు అని తెలిపారు. సమ్మేళనంలో కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న జంటలు పెద్ద ఎత్తున పాల్గొని తమ హక్కుల సాధన కోసం ఏకతాటిపైకి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐడిడబ్ల్యూఓ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దూడపాక రాజేందర్, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు ఇస్లావత్ రవీందర్, కేవీపీఎస్ జిల్లా నాయకులు అయిత మారుతి తదితరులు పాల్గొన్నారు.

## ఐపిజీఏ ఫెలోషిప్ అవార్డు

**2025కు కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వై. నరసింహ రెడ్డి ఎంపిక**




**హన్మకొండ, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ వై. నరసింహ రెడ్డి ప్రతిష్ఠాత్మకమైన ఐపిజీఏ ఫెలోషిప్ అవార్డు 2025కు ఎంపికయ్యారు. ఫార్మసీ రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న నిపుణులను గుర్తించి ఈ అవార్డును ఇండియన్ ఫార్మసీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ (ఐపిజీఏ) ప్రతీ సంవత్సరం ప్రదానం చేస్తుంది. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం నవంబర్ 8న (శనివారం) ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో బాబా సాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన ఐపిజీఏ 37వ వార్షిక సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా ఐపిజీఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ అరుణ్ గార్గ్ మరియు ఇతర ప్రముఖులు ప్రొఫెసర్ నరసింహ రెడ్డి గారికి జ్ఞాపిక, సర్టిఫికేట్ మరియు శాలువా అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రొఫెసర్ నరసింహ రెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో పరిశోధన, బోధన మరియు సామాజిక సేవలతో ప్రత్యేక కృషి చేసిన వారికి మాత్రమే ఈ ఫెలోషిప్ అవార్డు ప్రదానం చేయడం విశేషం. ఈ గౌరవం కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రతి ఒక్కరిది అని పేర్కొన్నారు. ఈ సందర్భంలో కాకతీయ విశ్వవిద్యాలయ బోధన మరియు బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ప్రొఫెసర్ రెడ్డిని హృదయపూర్వకంగా అభినందించారు.

## ఐపిజీఏ ఫెలోషిప్ అవార్డు 2025కు కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వై. నరసింహ రెడ్డి ఎంపిక

**జై భీమ్ న్యూస్ (కే.యూ. క్యాంపస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ వై. నరసింహ రెడ్డి ప్రతిష్ఠాత్మకమైన “ఐపిజీఏ ఫెలోషిప్ అవార్డు - 2025”కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం నవంబర్ 8 (శనివారం)న లక్నోలోని బాబా సాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన ఇండియన్ ఫార్మసీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ (ఐపిజీఏ) 37వ వార్షిక సమావేశంలో జరిగింది. ఉదయం జరిగిన సమావేశంలో ఐపిజీఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ అరుణ్ గార్గ్, ఇతర ప్రముఖులు ప్రొఫెసర్ నరసింహ రెడ్డికి జ్ఞాపిక, సర్టిఫికేట్, శాలువా అందజేసి సత్కరించారు. ఫార్మసీ రంగంలో విశిష్ట సేవలు అందించిన ఐపిజీఏ సభ్యులకు, నిర్దిష్ట ప్రమాణాలతో ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు ఈ ఫెలోషిప్ అవార్డు అందజేస్తారని ప్రొఫెసర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంలో ప్రొఫెసర్ రెడ్డిని కాకతీయ విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్యే నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**హైదరాబాద్, జూబ్లీహిల్స్, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు జూబ్లీహిల్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు, తెలంగాణ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుక జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ నవీన్ యాదవ్ గెలుపు లక్ష్యంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో భాగంగా జరిగింది. వేడుకలో తొలుత స్థానిక కళాకారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల తమ అభిమానాన్ని వ్యక్తం చేస్తూ ఆయన నాయకత్వాన్ని కొనియాడే ప్రత్యేక గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు.

**రాష్ట్ర అభివృద్ధికి రేవంత్ రెడ్డి నాయకత్వం కీలకం - ఎమ్మెల్యే నాగరాజు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రజల మనసుల్లో నిలిచిపోయే సంక్షేమ పథకాలతో, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని కొత్త దిశగా తీసుకెళ్తున్నారు అని అన్నారు. అలాగే, రేవంత్ రెడ్డి ఆశీస్సులతో జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలవాలని కోరుకుంటున్నాం అని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెంగళరావు నగర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అలాగే వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

## దాశరథిని బందించిన జైలును సందర్శించిన కవి బృందం

**నిజామాబాద్,నవంబర్8(జై భీమ్ న్యూస్):**

నిజాబాద్‌లో కవి దాశరథిని బందించిన జైలును కవి బృందం సందర్శించింది. ఇక్కడ ఆనాటి జైలు జీవితం అనుభవించిన కవి దాశఃరథి గురించి తెలుసుకోవడం మరచిపోలేనిదని బృందం సభ్యులు అన్నారు. ప్రముఖ పద్య కవి, నాటక కర్త దూరవేటి మాట్లాడుతూ దాశరథిని బంధించిన జైలును సందర్శించడం తమ పూర్వజన్మ పుణ్యమన్నారు. ఇక్కడ అగ్నిధారలో కురిపించిన దాశరథి పద్యాలను గుర్తు చేసుకుంటూ పాడుకుంటూ పులకించిపోయారు. వికారాబాద్ కేంద్రంగా సాహిత్య వికాసానికై కృషి చేస్తున్న అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక రాష్ట్రస్థాయి కవి బృందం శనివారం నిజామాబాద్ ఖిల్లా జైలు, రఘునాథ ఆలయాన్ని సందర్శించింది. అంతకుముందు బాసర కవి యాత్ర జిల్లా కేంద్రానికి చేరుకుంది. అందులోని సుమారు 40 మంది కవులు ఖిల్లా రామాలయాన్ని సందర్శించారు. అక్కడ దాశరథిని బంధించి ఉన్న జైల్లోకి వెళ్లి.. వారిని దర్శించుకున్నారు.

# వరద ముంపు బాధితుల మహా ధర్నా





### రిటైనింగ్ వాల్ నిర్మాణం తక్షణం చేపట్టాలని డిమాండ్

**హన్మకొండ, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

వరద ముంపుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న హనుమకొండ నగరంలోని గోపాలపురం, వడ్డేపల్లి ప్రాంత ప్రజలు శనివారం మహా ధర్నా నిర్వహించారు. తులసి బార్ జంక్షన్ వద్ద ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ ధర్నాలో బాధితులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ధర్నా అనంతరం బాధితులు ర్యాలీగా కే.యూ. జంక్షన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గోపాలపురం ఊర చెరువు కట్ట, వడ్డేపల్లి చెరువు నుండి వచ్చే వరద కాలువకు వెంటనే రిటైనింగ్ వాల్ నిర్మించాలని, వడ్డేపల్లి మత్తడి నుండి గోపాలపురం వరకు అండర్ డ్రైనేజీ మార్గాలను సైంటిఫిక్ పద్ధతిలో నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. వివేక్‌నగర్, ప్రగతినగర్, హుడా కాలనీ, టీవీ టవర్, సమ్మయ్యనగర్, ఇంజనీర్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, శ్యామల దుర్గాదాస్, అమరావతి నగర్, శ్రీనివాస కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**మత్తడి నాలా మూసివేతే విపత్తుకు మూలం..**

ధర్నాలో మాట్లాడుతూ కాలనీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు అన్నారు "మత్తడి నాలాను మూసివేసి భూగర్భ జల సొరంగం నిర్మాణం చేయడం, గేట్లు ఎత్తివేయడంలో అధికారులు విఫలమవడం వల్లే వరద ముంపు సంభవించింది. జీవో ఎంఎస్ 81 ప్రకారం ప్రతి సంవత్సరం చెరువుల సిల్ట్ తొలగించడం, ఎఫ్టీఎల్ సరిహద్దులు గుర్తించడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, చెరువుల సంరక్షణ చేయడం వంటి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్, రెవెన్యూ మరియు మున్సిపల్ శాఖలదే అయినా, ఆ బాధ్యతలను విస్మరించారని" వారు విమర్శించారు.

**బాధితుల ప్రధాన డిమాండ్లు...**

గోపాలపురం ఊర చెరువుకు శాశ్వత రిటైనింగ్ వాల్ నిర్మించాలి. వడ్డేపల్లి చెరువు నుండి వచ్చే వరద కాలువకు తక్షణ రిటైనింగ్ వాల్ నిర్మించాలి. వడ్డేపల్లి మత్తడి నుండి గోపాలపురం వరకు అండర్ డ్రైనేజీ మార్గాలను సైంటిఫిక్ పద్ధతిలో నిర్మించాలి. వరద ముంపుకు కారణమైన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి. వరద బాధితులకు సరైన పరిహారం అందించడంతో పాటు శాశ్వత పునరావాస చర్యలు చేపట్టాలి.

**జేఏసీ ఏర్పాటు చేసి పోరాటం కొనసాగిస్తాం..**

బాధితులు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టకపోతే, అన్ని కాలనీల ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేసి న్యాయం జరిగేంతవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ధర్నా, ర్యాలీలో 100 ఫీట్ల రోడ్ అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్యామల దుర్గాదాస్ కాలనీ అధ్యక్షులు డా. నల్లాని శ్రీనివాస్, వివేక్‌నగర్ కాలనీ అధ్యక్షులు మర్రి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మీసాల రమేష్, సామాజిక కార్యకర్తలు వి. వీరన్న, తుపాకుల దశరథం, శ్రీధర్ రెడ్డి, దేవ్ సింగ్, నవీన్ నాయక్, రాజ్‌కుమార్, ఎల్. దీప, ఎం. చుక్కయ్య, రాజు, ప్రగతినగర్ అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్, టీఎన్జీవోస్ అధ్యక్షులు బూర నారాయణ, పింగిలి అశోక్ రెడ్డి, లింగంపల్లి వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి పరిసర ప్రాంతాల్లో కోళ్ల కలకలం

### శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించిన వెటర్నరీ అధికారులు




**హనుమకొండ జిల్లా, ఎల్కతుర్తి, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి శివారులో శనివారం ఉదయం కోళ్ల మరణం చోటుచేసుకోవడంతో స్థానిక రైతులు, పక్షి పెంపకదారులు ఆందోళనకు గురయ్యారు. గ్రామంలోని పలువురు రైతులు తమ పక్షుల్లో ఆకస్మిక మరణాలు సంభవించాయని గుర్తించి వెంటనే పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన వెటర్నరీ శాఖ వైద్యాధికారి డాక్టర్ దీపిక తన బృందంతో ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృత కోళ్లను సేకరించి ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన అనంతరం, మరణాలకు గల కారణాలను ఖచ్చితంగా తెలుసుకునేందుకు శాంపిల్స్‌ను ల్యాబొరేటరీకి పంపించినట్లు ఆమె తెలిపారు. ప్రాథమికంగా వైరల్ ఇన్ఫెక్షన్ లేదా వాతావరణ మార్పులు కారణంగా ఉండొచ్చని అనుమానం ఉన్నప్పటికీ, స్పష్టత రిపోర్ట్ వచ్చిన తర్వాతే తెలుస్తుంది అని డా. దీపిక తెలిపారు. ఆమె మాట్లాడుతూ రైతులు, పక్షి పెంపకదారులు అప్రమత్తంగా ఉండాలి. పక్షుల్లో ఎలాంటి అసాధారణ ప్రవర్తన లేదా మరణాలు గమనించిన వెంటనే సమీప పశుసంవర్ధక శాఖకు సమాచారం ఇవ్వాలి. పక్షులను పరిశుభ్రంగా ఉంచడం, పింజరాలను శుభ్రం చేయడం, కాలుష్యరహిత నీరు ఇవ్వడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచించారు. గ్రామస్థులు, పక్షి పెంపకదారులు ఈ పరిణామంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, పశుసంవర్ధక శాఖ త్వరగా రిపోర్ట్ విడుదల చేయాలని కోరుతున్నారు. ల్యాబ్ ఫలితాలు వచ్చే వరకు అధికారులు కోళ్ల విక్రయం, రవాణాపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు.

# ప్రపంచ చరిత్రలో అక్టోబర్ విప్లవం స్ఫూర్తిదాయకం

### ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లేపు ఉపేందర్ రెడ్డి



**హన్మకొండ, నవంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

రష్యన్ అక్టోబర్ విప్లవం ప్రపంచ చరిత్రలో సమాన హక్కులు, సమ సమాజ స్థాపనకు దారితీసిన స్ఫూర్తిదాయక ఘటనగా నిలిచిందని, అదే స్ఫూర్తితో నేటి మతోన్మాదం, యుద్ధోన్మాదం, ఫాసిజం వంటి శక్తులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఎంసీపీఐ(యూ) పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వల్లేపు ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. భద్రకాళి కాలనీ, ములుగు రోడ్డులోని కర్ర రాజిరెడ్డి నివాసంలో, ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రష్యన్ అక్టోబర్ విప్లవ 108వ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి కామ్రేడ్ దామరకొండ రమేష్ అధ్యక్షత వహించారు. ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ బూర్జువా, భూస్వామ్య, పెట్టుబడిదారీ దోపిడీ విధానాలకు ప్రత్యామ్నాయంగా కార్మిక రాజ్యాన్ని స్థాపించి, ప్రపంచ మానవాళికి మార్గదర్శకంగా నిలిచింది రష్యన్ విప్లవమని అన్నారు. భూ పంపిణీ, కార్మిక హక్కులు, మహిళా హక్కులు, సంపదల సమాన పంపిణీ ద్వారా సమాజంలో సమానత్వం సాధించిన విప్లవం నేటికీ ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. సామ్రాజ్యవాద నియంతృత్వం, యుద్ధోన్మాదం, మతోన్మాద దోపిడీ పద్ధతుల పెరుగుదలపై శ్రామిక వర్గాలు ఐక్యంగా ఎర్రజెండా కింద పోరాటం చేయాలి అని ఆయన పిలుపునిచ్చారు. దేశంలోని కమ్యూనిస్టు శక్తులను ఏకం చేయడానికి, ప్రత్యామ్నాయ సామాజిక ప్రభుత్వ స్థాపన కోసం ఎంసీపీఐ(యూ) కృషి చేస్తోందని తెలిపారు. ఈనెల 7 నుండి 17 వరకు దేశవ్యాప్తంగా అక్టోబర్ విప్లవ వార్షికోత్సవాల సందర్భంగా సామ్రాజ్యవాద, యుద్ధ మతోన్మాద విధానాలను నిరసిస్తూ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నాము అని తెలిపారు. సభలో జిల్లా సహాయ కార్యదర్శి నీల రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, కర్ర రాజిరెడ్డి, చీపురు ఓదయ్య, జిల్లా కమిటీ సభ్యులు కుసం బుచ్చయ్య, కూతురు ఇంద్ర రెడ్డి, మంద భద్రయ్య, బలుగురి రాజేశ్వర్ రావు, పార్టీ సభ్యులు కర్ర మనోహర్, కర్ర సీతారాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ జిల్లాలో ఘోర ప్రమాదం..

నల్గొండ, నవంబర్8(జై భీమ్ న్యూస్): తెలంగాణలోని నల్గొండ జిల్లాలో ఈ ఉదయం పెను ప్రమాదం తప్పింది. వేగంగా వెళ్తున్న ఓ ఇన్నోవా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. క్షణాల్లోనే కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. అయితే, అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద హైదరాబాద్-విజయవాడ 65వ జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ ఇన్నోవా కారు యూటర్న్ తీసుకునే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఆ వేగానికి కారు రోడ్డుపైనే పల్టీలు కొట్టింది. వెంటనే ఇంజిన్‌లో మంటలు చెలరేగి కారు మొత్తానికి వ్యాపించాయి. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే ప్రయాణికులు అప్రమత్తమై కారులో నుంచి బయటకు దూకేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కానీ, అప్పటికే కారు పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కారును రోడ్డుపై నుంచి తొలగించే వరకు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కోట్లాది విలువ చేసే దళితుడి వ్యవసాయ భూమిని స్వాధీనం చేసుకున్న గుజరాత్ మార్వాడి



**హొసకోటె (బెంగళూరు గ్రామాంతర జిల్లా) జై భీమ్ న్యూస్:**

కోట్లాది రూపాయల విలువైన దళితుడి వ్యవసాయ భూమిని స్వాధీనం చేసుకుని, రౌడీలతో బెదిరించి, వ్యవసాయాన్ని గుజరాత్ మార్వాడి అడ్డుకుంటున్నాడని భీమ్ సేవా సమితి స్థాపకుడు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ రావణ్ ఆరోపించాడు. బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోట్ తాలుకు సులిబెలే హొబ్లి దొడ్డ అరలగేరె గ్రామ పంచాయతీ పరిధిలోకి వచ్చే భువనహల్లి గ్రామంలో ఎస్సీ షెడ్యూల్డ్ కులానికి చెందిన మద్దురప్ప బిన్ దాసప్పకు పీటీసీఎల్ చట్టం ప్రకారం 1 ఎకరం 36 గుంట భూమిని కేటాయించారు, తేదీ 26/06/1993, భువనహల్లి గ్రామంలోని సర్వే నంబర్ 45లో 1 ఎకరం 36 గుంట భూమిని కేటాయించినప్పటికీ వంశపారంపర్యంగా, అతను ఆ భూమిలో నివసిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కృష్ణప్ప, తన నాయకత్వంలో, తాను చూసిన గుజరాతీ స్థానికుడు రాంజీ కంజీరవారియా బిన్ కంజీ రవారియా అనే వ్యక్తికి భూమిని విక్రయించాడు. మద్దురప్ప బిన్ దాసప్ప భూమికి 7 మంది వారసులు ఉన్నారు, మిగిలిన 6 మంది వారసులు "అమ్మకపు ఒప్పందం" కుదుర్చుకుని, ఒక్కొక్కరికి 2 లక్షల రూపాయలు చెల్లించి 6 నెలల్లోపు క్లీన్ కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. వారు ఆ భూమిలో అక్రమంగా షెడ్లు నిర్మించి, గుజరాత్‌కు చెందిన రెండు కుటుంబాలను మరియు అనుమానాస్పద యువకులను రౌడీలుగా ఉంచి భూమిలోకి ప్రవేశించారు. భూమి యజమానులు భూమి సమీపంలో వ్యవసాయం చేయడానికి వెళ్ళినప్పుడు, వారు వారిని బెదిరించారు. సంఘటన తెలిసిన వెంటనే, భీమ్ సేవా సమితి సంస్థ సంఘటనా స్థలాన్ని సందర్శించి, ఆ భూమిలో ఉన్న రౌడీలను హెచ్చరించింది మరియు వెంటనే 112 అత్యవసర పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సిబ్బంది సందర్శించి సంఘటనను నమోదు చేసి, దుర్మార్గులపై చర్యలు తీసుకోవాలని మరియు భూమికి సంబంధించిన పత్రాలను అందించాలని అధికార పరిధిలోని సులిబెలే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబాన్ని మరియు భూమిని రక్షించడానికి ఈ ఫిర్యాదు దాఖలు చేయబడింది. భూమి పత్రాల ప్రకారం, బాధిత కుటుంబానికి వీలైనంత త్వరగా రక్షణ కల్పించబడుతుంది అని శ్రీకాంత్ రావణ్ తెలిపారు. తద్వారా బాధిత కుటుంబం యొక్క భూమికి ఎటువంటి ఇబ్బంది కలగదు మరియు భూమిలో వ్యవసాయం చేయడంలో ఎటువంటి ఇబ్బంది ఉండదు. గుజరాత్‌లోని మార్వాడిలు లేదా వారు పెంచి పోషించిన వారిచే వేధింపులకు గురైనా లేదా అన్యాయం చేయబడినా బాధిత వ్యక్తులకు చట్టంలో గుణపాఠం నేర్పబడుతుంది మరియు భీమ్ సేవా సమితి సంస్థ ఎస్సీ ఎస్టీ (అత్యాచారాల నివారణ) చట్టం, 1989 ప్రకారం దళితులను చట్టబద్ధంగా భూమిని వ్యాపారం చేయకుండా మోసం చేసిన బాధిత కుటుంబానికి ఎస్సీ ఎస్టీ (అత్యాచారాల నివారణ) చట్టం, 1989 కింద అధికార పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యూత్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్ బి.సి., డ్రైవర్ జిల్లా అధ్యక్షుడు మునిరాజ్ బి.ఆర్., ఆటో యూనిట్ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ సి., కార్మిక జిల్లా అధ్యక్షుడు వరుణ్ రాజ్ చక్రవర్తి, మైనారిటీ అధ్యక్షుడు సయ్యిద్ అగా, జిల్లా అధ్యక్షుడు కిరణ్ పృథ్వీ, ఆటో తాలుక అధ్యక్షుడు సూర్య (సూరి), యూత్ అధ్యక్షుడు తరుణ్, కార్మిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినయ్ కుమార్, ఆటో రాష్ట్ర అధ్యక్షుడు నాగేష్ సి. పాల్గొన్నారు.




# అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి

### ఆకస్మిక మృతితో శోకసంద్రంలో కుటుంబం

**బాపట్ల,నవంబర్8(జై భీమ్ న్యూస్):**

అమెరికాలో మరో తెలుగు జ్యోతి ఆరిపోయింది. బాపట్ల జిల్లాకు చెందిన అమ్మాయి మృత్యువాత పడింది. ఉన్నత విద్యనభ్యసించి కుటుంబాన్ని ఆదుకోవాలనే లక్ష్యంతో ఎన్నో ఆశలతో అమెరికాలో అడుగుపెట్టిన ఆ విద్యార్థిని ఆశలు అడియాశలయ్యాయి. చదువు పూర్తి చేసుకుని.. కొద్దిరోజుల్లో కొలువులో చేరుతుందని ఆశగా ఉన్న ఆ కుటుంబ ఆశల దీపాన్ని విధి వెక్కిరించింది. అనారోగ్యం రూపంలో ఆమెను బలిగొంది. బాపట్ల జిల్లా కారంచేడుకు చెందిన యార్లగడ్డ రామకృష్ణ, నాగమణి దంపతుల కుమార్తె రాజ్యలక్ష్మి (23) విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం అమెరికాలోని ఓ యూనివర్సిటీలో ఎంఎస్ కంప్యూటర్స్ విభాగంలో 2023లో చేరింది. ఇటీవల విద్యాభ్యాసం కూడా ముగియడంతో అక్కడే స్నేహితులతో కలిసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. మూడు రోజుల క్రితం జలుబు, ఆయాసంగా ఉందని.. చికిత్స కోసం ఈనెల 9కి వైద్యుల అపాయింట్‌మెంట్ తీసుకున్నానని గురువారం రాత్రి కుటుంబ సభ్యులకు తెలిపింది. అదే రోజు రాత్రి స్నేహితులతో కలిసి నిద్రపోయింది. రాజ్యలక్ష్మిని ఉదయం స్నేహితులు నిద్రలేపేందుకు ప్రయత్నించగా.. ఎలాంటి స్పందన లేదు. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మరణవార్త విన్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తల్లిదండ్రులిద్దరూ అచేతన స్థితిలో ఉండిపోయారని మృతురాలి సోదరుడు రాజా తెలిపారు. రాజ్యలక్ష్మి మరణంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అమెరికాలో రాజ్యలక్ష్మి మృతి చెందడంపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించి అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. మృతదేహాన్ని అమెరికా నుంచి తీసుకొచ్చేందుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# జూబ్లీహిల్స్ పరిధిలో పోలీస్ ఆంక్షలు

### ప్రకటన జారీచేసిన కమిషనర్ సజ్జన్నార్

**హైదరాబాద్,నవంబర్8(జై భీమ్ న్యూస్):**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ దృష్ట్యా ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఆదివారం సాయంత్రం నుంచి పోలింగ్ జరుగనున్న మంగళవారం సాయంత్రం వరకు అమల్లో ఉంటాయి. ఈ మేరకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గం పరిధిలో 9వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి పోలింగ్ జరగనున్న 11వ తేదీ మంగళవాం సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లోకి వస్తాయి. అలాగే తిరిగి ఓట్ల లెక్కింపు జరిగే 14న ఉదయం 6 గంటల నుంచి 15 సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. నిర్దేశించిన సమయాల్లో మద్యం దుకాణాలన్నీ మూసి వేయాలని, హోటళ్లు, రెస్టారంట్‌లు, క్లబ్బులు మూసివేయాలని ఆదేశించారు. శాంతిభద్రతల నేపథ్యంలో నియోజకవర్గం వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధమన్నారు. ఓట్ల లెక్కింపు రోజున రహదారులు, జనావాసాల్లో టపాసులు పేల్చడం నిషేధమని, ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.



# కశ్మీర్‌లో వాలిన అనుమానం పక్షి

సిద్దు జొన్నలగడ్డ నటించిన డీజే టిల్లు సినిమాతో రైటర్ కమ్ డైరెక్టర్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు విమల్ కృష్ణ. తాజాగా విమల్ కృష్ణ మరో క్రేజీ ఎంటర్‌టైనర్‌తో వినోదాన్ని అందించేందుకు రెడీ అవుతున్నాడు. రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న చిత్రం అనుమాన పక్షి. ఈ మూవీ టీం కశ్మీర్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. జీరో అనుమానంతో కశ్మీర్ షెడ్యూల్ పూర్తయిందంటూ ట్వీట్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా షూటింగ్ లొకేషన్‌లో రాగ్‌మయూర్ అండ్ టీం దిగిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రాన్ని చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలకా, రాజేశ్ జగ్‌తియాని, హిరాచంద్ దండ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఆ ఒక్కటి అడక్కు తర్వాత చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌లో వస్తోన్న సినిమా కావడంతో క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఫన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల మ్యూజిక్ కంపోజర్‌గా పనిచేస్తున్నాడు. ప్రిన్స్ సెసిల్, చరిత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సునీల్ కుమార్ నామా సినిమాటోగ్రఫర్‌గా వ్యవహరిస్తున్న ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# రజనీకి అరుదైన గౌరవం



### అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో సన్మానం

భారతీయ చలనచిత్ర పరిశ్రమకు సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించిన సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. ఇటీవల నట జీవితంలో 50 ఏళ్ల ఘన ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా 56వ అంతర్జాతీయ చలనచిత్ర ఉత్సవం ముగింపు వేడుకలో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు. ఈ సన్మానం ఐఎఫ్ఎఫ్ఐకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండగా.. గోవా వేదికగా నవంబర్ 20 నుంచి 28 వరకు ఈ వేడుక జరుగనుంది. బస్ కండక్టర్‌గా జీవితం ప్రారంభించిన శివాజీ రావు గైక్వాడ్ అలియాస్ రజనీకాంత్? 1975లో లెజెండరీ దర్శకుడు కె. బాలచందర్ రూపొందించిన 'అపూర్వ రాగంగళ్' చిత్రంతో నట జీవితాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా, తనదైన స్టైల్‌తో, విలక్షణమైన పాత్రలతో కోట్లాది మంది అభిమానుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు. తన యాక్షన్, స్టైలింగ్‌తో ఇండియా అంతటా సూపర్‌స్టార్‌గా గుర్తింపు సాధించాడు. ఇక ఈ ఎఈఈఎ వేడుకల్లో గురు దత్, రాజ్ ఖోస్లా, రిత్విక్ ఘటక్, పి. భానుమతి, భూపేన్ హజారికా వంటి పలు దిగ్గజ కళాకారుల శత జయంతి వేడుకలు కూడా జరగనున్నాయి. ఈ తొమ్మిది రోజుల ఉత్సవంలో 81 దేశాల నుండి 240కి పైగా చలనచిత్రాలను ప్రదర్శించనున్నారు.

# చక్‌దే ఎక్స్‌ప్రెస్ విడుదలలో కదలిక

మహిళల వన్డే ప్రపంచ కప్‌ను టీమ్‌ఇండియా సగర్వంగా సొంతం చేసుకొని చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో అనుష్క శర్మ నటించిన 'చక్‌దే ఎక్స్‌ప్రెస్' మరోసారి చర్చనీయాంశమవుతోంది. అనుష్క శర్మ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా షూటింగ్ ఏడేళ్ల క్రితం పూర్తయినా ఇప్పటివరకూ విడుదలకు నోచుకోలేదు. అయితే, ఇటీవల మన అమ్మాయిలు ప్రపంచ కప్ సాధించిన నేపథ్యంలో ఈ సినిమా విడుదల చేయాలని అభిమానులు పోస్ట్‌లు పెట్టడంతో.. నిర్మాతలు దీన్ని రిలీజ్ చేయాలని భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా విడుదల కోసం నెట్‌ఫ్లిక్స్‌తో చిత్రబృందం చర్చలు కూడా జరిపినట్లు తెలుస్తోంది. 'చక్‌దే ఎక్స్‌ప్రెస్' కోసం అనుకున్న దానికంటే బడ్జెట్ ఎక్కువవడంతో అభిప్రాయ భేదాలు వచ్చి సినిమా విడుదల ఆగిపోయిందని ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే వన్డే ప్రపంచకప్‌ను భారత అమ్మాయిలు గెలుచుకున్న నేపథ్యంలో దీన్ని ఇప్పుడు విడుదల చేస్తే ఆదరణ సొంతమవుతుందని చిత్రబృందం భావించినట్లు తెలుస్తోంది. ఈ నెలలోనే దీనిపై తుదినిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. భారత దిగ్గజ మహిళా క్రికెటర్ ఝులన్ గోస్వామి జీవితం ఆధారంగా.. అనుష్కశర్మ ప్రధాన పాత్రధారిగా 'చక్‌దే ఎక్స్‌ప్రెస్' రూపొందింది. ఈ చిత్రానికి ప్రొసిత్‌రాయ్ దర్శకత్వం వహించగా, కర్నేష్ శర్మ నిర్మాతగా వ్యవహరించారు. హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ప్రపంచకప్ గెలిచినప్పుడు ఈ సినిమాను విడుదల చేయాలని కోరుతూ అభిమానులు పోస్ట్‌లు పెట్టిన విషయం తెలిసిందే.



# ఎస్..విజయ్‌ను పెళ్లి చేసుకోబోతున్నా

### తనకోసం నిలబడే వ్యక్తి కావాలనుకున్నా

ఎట్టకేలకు రష్మిక తన పెళ్లిపై క్లారిటీ ఇచ్చారు. నటుడు దేవరకొండ విజయ్‌ను విశాహం చేసుకో బోతున్నట్లు చెప్పారు. అలాగే ఎంగేజ్‌మెంట్ విషయంలో మీరు అనుకున్నదే నిజమని ఒప్పుకున్నారు. తన కోసం యుద్ధం చేసే జీవిత భాగస్వామి కావాలని నటి రష్మిక తాజాగా ఓ చిట్‌చాట్‌లో తెలిపారు. వరుస సినిమాలు, విజయ్ దేవరకొండతో నిశ్చితార్థం వార్తలతో గతకొన్ని రోజులుగా నిత్యం రష్మిక ట్రెండింగ్‌లో ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా ఒక యూట్యూబ్ ఛానల్ చిట్‌చాట్‌లో ఆమె పాల్గొన్న సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆసక్తికర సమాధానం చెప్పారు. తన భాగస్వామి ఎలా ఉండాలని కోరుకుంటున్నారో చెప్పాలని ఒక అభిమాని కోరగా రష్మిక నవ్వుతూ దానికి సమాధానమిచ్చారు. ప్రపంచం మొత్తం తనకు వ్యతిరేకంగా ఉన్నా కూడా తన కోసం నిలబడే జీవిత భాగస్వామి కోసం వెతుకుతున్నట్లు వివరించారు. నిజాయితీగా చెప్పాలంటే నన్ను లోతుగా అర్థం చేసుకునే వ్యక్తి. ప్రతి విషయాన్ని నావైపు నుంచి ఆలోచిస్తూ అర్థం చేసుకోవాలి. అన్ని పరిస్థితులను ఎదుర్కొనే వ్యక్తి.. ఎలాంటి దాన్నైనా అర్థం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తిని నేను కోరుకుంటున్నాను. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి, నాకోసం యుద్ధం చేయగల వ్యక్తి కావాలి. అలాంటి భాగస్వామి కోసం నేను ఎంత దూరమైనా వెళ్తాను. యుద్ధంలో తూటాకైనా ఎదురెళ్తా అని రష్మిక తెలిపారు. ఒకవేళ మీరు డేట్ చేస్తే ఎవరితో చేస్తారు? పెళ్లి చేసుకుంటే ఎవరిని చేసుకుంటారు? అని మరో అభిమాని అడగ్గా.. డేట్ చేస్తే యానిమేషన్ క్యారెక్టర్ నరుటోతో చేస్తా. ఎందుకంటే నాకు నరుటో పాత్ర చాలా ఇష్టం. పెళ్లి చేసుకుంటే విజయ్‌ని చేసుకుంటా అని చెప్పారు. ఈ సమాధానంతో ఆడియన్స్ అందరూ పెద్దగా అరుస్తూ కంగ్రాట్స్ చెప్పారు. రష్మిక థాంక్స్ చెప్పారు. అక్టోబర్ 3న రష్మిక, విజయ్‌ల నిశ్చితార్థం జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించనప్పటికీ ఈ మధ్య పలు ఇంటర్వ్యూల్లో రష్మిక పరోక్షంగా స్పందించారు. 'నా ఎంగేజ్‌మెంట్ విషయంలో మీరు ఏం అనుకుంటున్నారో అదే నిజం. సమయం వచ్చినప్పుడు వెల్లడిస్తా' అని అన్నారు. ఇప్పుడు విజయ్‌తో పెళ్లి విషయంలో స్పష్టమైన సమాధానమిచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరి పెళ్లి జరగనున్నట్లు టాక్ వినిపిస్తోంది.

# రాజ్‌తరుణ్ హీరోగా చిరంజీవ

### దర్శకత్వ కోరిక తీర్చుకున్న జబర్దస్త్ అదిరే అభి

'జబర్దస్త్'తో బుల్లితెర ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన వేణు, ధన్‌రాజ్‌లాంటి కమెడియన్లు.. దర్శకులుగా ఎమోషనల్ చిత్రాలు తీసి మెప్పించారు. అదే షోతో సందడి చేసిన అదిరే అభి (అభినయ కృష్ణ) డైరెక్టర్ కావాలన్న తన ఎన్నో ఏళ్ల కలను 'చిరంజీవ' తో నెరవేర్చుకున్నారు. సోషియో ఫాంటసీ టచ్‌తో ఎంటర్‌టైనర్‌గా దాన్ని రూపొందించారు. రాజ్‌తరుణ్ హీరో, కుషిత కల్లపు హీరోయిన్‌గా తీసిని మూవీ ఓటీటీ 'ఆహా' లో రిలీజ్ అయింది. హైదరాబాద్‌కు చెందిన శివ (రాజ్‌తరుణ్)కు దూకుడెక్కువ. ఆ వేగమే అతడిని అంబులెన్స్ డ్రైవర్‌ని చేస్తుంది. ఇతరుల ఆయుష్షు ఎప్పటి వరకూ ఉందో తెలుసుకునే పవర్ తనకు ఉందని ఓ రోడ్డు ప్రమాదంతో శివకు అర్థమవుతుంది. దాన్ని 'క్యాష్' చేసుకుని, తన అప్పులన్నీ తీర్చేయాలని నిర్ణయించుకుంటాడు. కార్పొరేటర్ సత్తు పహిల్వాన్‌తో ఓ డీల్ మాట్లాడతాడు. ఆ ఒప్పందమేంటి? డబ్బు కోసం అలా చేయడం తప్పని భావించిన తర్వాత శివ ఏం చేశాడు? ఓ భారీ ప్రమాదం నుంచి ఎంతోమందిని రక్షించేందుకు ప్రయత్నించిన శివకీ, స్థానిక ఎమ్మెల్యేకీ ఉన్న వైరం ఏంటి? తోటి మనిషి ఆయుష్షు ఎంతో చెప్పే వరం శివకు ఎలా వచ్చింది? తదితర అంశాల సమాహారమే 'చిరంజీవ'. అకాల మరణం చెందిన హీరో నరకానికి వెళ్లి.. యముడిని ప్రశ్నించడాన్ని, యముడే భూమ్మీదకు రావడాన్ని కొన్ని చిత్రాల్లో చూశాం. 'చిరంజీవ' కూడా అలా యముడి చుట్టూ అల్లుకున్న కథే. కానీ, ఇందులో ఆయన గురించి చెప్పే సన్నివేశాలే తప్ప ప్రత్యేకంగా పాత్రంటూ ఉండదు. మనిషి చావుకు నిజంగా యమధర్మారాజే కారకుడా? అని ప్రశ్నించుకునేలా చేస్తుందీ చిత్రం. హీరో పొందిన వరం గురించి సినిమా ప్రారంభంలోనే తెలుస్తుంది. దాన్ని ఎలా వాడాడన్నదే కీలకం. అంబులెన్సు డ్రైవర్‌గా కథానాయకుడి పరిచయం, వెహికల్‌ను వేగంగా నడపకపోవడాన్ని కారణంగా చెబుతూ మృతుల బంధువులు అతడితో వాగ్వాదానికి దిగడం, దాంతో అతడు మరో ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేయడం.. ఇలా సరదా సన్నివేశాలతో ప్రారంభమవుతుందీ సినిమా. చిన్న ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌తోనే శివ బాల్యం, కుటుంబ నేపథ్యం, అతడిది మామూలు జాతకం కాదని ప్రేక్షకుడికి అర్థమవుతుంది. అయితే కథను 'యమలోకా'నికి షిఫ్ట్ చేయకుండా జనజీవన స్రవంతి చుట్టూనే తిప్పారు. అందుకే ఇందులో విజువల్స్ కన్నా వాస్తవానికే అధిక ప్రాధాన్యముంది. తనకున్న వరమేంటో ఒకానొక సమయంలో గ్రహించిన శివ.. దాని ద్వారా డబ్బులు సంపాదించే ప్రయత్నాలు నవ్వులు పూయిస్తాయి. అయితే, లాజిక్స్ పట్టించుకోకపోతేనే అందులోని ఫన్ ఆస్వాదించగలం. అనుకోకుండా ఓ గుడికి వెళ్లిన శివలో మార్పు వచ్చినప్పటి నుంచి కథ మరో టర్న్ తీసుకుంటుంది. దాని కోసం అల్లుకున్న ఎమోషనల్ సీన్లు పెద్దగా ప్రభావం చూపవు. ఎమ్మెల్యే- శివల మధ్య చిత్రీకరించిన ఘర్షణ సీక్వెన్స్‌లోనూ కామెడీని జోడించడంతో అది ఇంపాక్ట్ క్రియేట్ చేయలేకపోయింది. తన బాడీ లాంగ్వేజ్‌కు తగ్గ రోల్ కావడంతో రాజ్ చెలరేగిపోయారు. హీరోయిన్ కుషిత కల్లపు అందం, అభినయంతో ఆకట్టుకుంటుంది. రచ్చ రవి తదితరులు చిన్న పాత్రల్లో సందడి చేశారు. దర్శకుడిగా అభి తొలి ప్రయత్నం మెప్పిస్తుంది.